www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

విలేకరులు కావలెను

18సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల, మండలాల వారీగా విలేకరులు కావలెను..

★ ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించవలసిన నంబర్ ★

సెల్ నెంబర్: 9951494039

సంపుటి : 17 | సంచిక : 183 | గురువారం 27.08.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

## నేడు యువతతో ప్రధాని సంభాషణ..

### 'నషా ముక్త్ యువ'పై మోదీ ప్రత్యేక సంభాషణ



క్రీడలు.. ఫిట్‌నెస్.. యువ నాయకత్వం పై చర్చ

- జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఖేలో ఇండియా డైలాగ్
- యువతతో మోదీ ప్రత్యేక సంభాషణ
- క్రీడా మౌలిక వసతులపై ప్రత్యేక ఫోకస్
- యువత ఆకాంక్షలపై మోదీ దిశానిర్దేశం
- యువ నాయకత్వం వైపు కొత్త అడుగులు
- క్రీడలతో మాదక ద్రవ్యాల వ్యసనానికి చెక్
- భవిష్యత్ నైపుణ్యాలపై యువతకు మార్గనిర్దేశం 02

## మాది అసలైన కాంగ్రెస్ రక్తం..

### భట్టీతో భేటీ అనంతరం రాజగోపాల్ రెడ్డి

నా కూతురి ప్లాన్ బి ఏంటో నాకేం తెలుసు?



కాంగ్రెస్‌ను వీడేది లేదు, వివాదంతో నాకు సంబంధం లేదు.. కొండా మురళి సంచలనం



నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరగొద్దు కొండా సురేఖపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్

**టికెట్ల విషయంలో పార్టీ ఆత్మపరిశీలన చేయాలన్న రాజగోపాల్**

**పార్టీ మార్పు ప్రచారాన్ని ఖండించిన కొండా మురళి**

- పార్టీ బలోపేతం కోసమే మాట్లాడుతున్నానన్న ఎమ్మెల్యే
- నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం జరగొద్దు
- టికెట్ల విషయంలో పార్టీ ఆత్మపరిశీలన చేయాలన్న రాజగోపాల్ 03
- కొండా సురేఖ వ్యవహారంపై కీలక వ్యాఖ్యలు
- పార్టీ మార్పు ప్రచారాన్ని ఖండించిన కొండా మురళి
- సుస్మిత ప్లాన్-బిపై మురళి ఆసక్తికర వ్యాఖ్యలు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో భేటీపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టత ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధి, నిధుల కోసమే సమావేశమైనట్లు తెలిపారు. పార్టీ బలోపేతం, నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతోనే తాను మాట్లాడుతున్నానన్నారు. కొండా సురేఖ, చిన్నారెడ్డి వ్యవహారంలో అధిష్టానం నిర్ణయమే తుది నిర్ణయమని స్పష్టం చేశారు.

మరోవైపు పార్టీ మారుతున్నారన్న ప్రచారాన్ని కొండా మురళి ఖండించారు. కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తూ, భట్టి విక్రమార్కతో భేటీ కేవలం యోగక్షేమాల కోసమేనని తెలిపారు. సుస్మిత వ్యాఖ్యలు, ఆమె ప్లాన్-బిపై కూడా మురళి ఆసక్తికరంగా స్పందించారు.

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో భేటీపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధి, నిధుల కోసమే భట్టిని కలిశానని చెప్పారు. తనపై విమర్శలు చేసేవారి గురించి తాను మాట్లాడనని తనను విమర్శిస్తున్న వారి స్థాయి ఏంటో తనను ఎందుకు విమర్శిస్తున్నారో ఓ సారి ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. ఇవాళ ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్కతో భేటీ అనంతరం కొమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతల్లో తాను ఒకడినని, పార్టీ కష్టకాలంలో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసిన వాడినన్నారు. 2018 ఎన్నికల్లో పెద్ద పెద్ద లీడర్లు ఓటమి పాలైనా మునుగోడు ప్రజలు మాత్రం తనను గెలిపించారన్నారు. తెలంగాణలో ప్రతిపక్షమే లేకుండా చేయాలని చూసిన కేసీఆర్‌కు వ్యతిరేకంగా సర్వస్వం ధారపోసి కొట్లాడిన వ్యక్తిని నేనని అలాంటి నాపై మాట్లాడే వారు...


## నేపాల్‌లో వరద బీభత్సం..

**కొట్టుకుపోయిన గ్రామాలు.. 1,000 మందికి పైగా గల్లంతు!**

రసువాలో భారీ నష్టం.. 13 మృతదేహాల వెలికితీత

4 వేల మందికి పైగా వరద ప్రభావం

- నేపాల్‌లో భీకర వరదలు.. గ్రామాలు జలమయం
- ఉప్పొంగిన భోటేకోషి.. కకావికలమైన రసువా
- క్షణాల్లో కొట్టుకుపోయిన నదీ తీర గ్రామాలు
- వరద ఉధృతికి భారీగా జనావాసాల ధ్వంసం
- డజనుకు పైగా గ్రామాలను ముంచెత్తిన వరదలు
- రంగంలోకి రెస్క్యూ బృందాలు.. కొనసాగుతున్న సహాయక చర్యలు
- రెండు సైనిక హెలికాప్టర్లతో రెస్క్యూ ఆపరేషన్
- నేపాల్ ఆర్మీ, పోలీస్ బలగాలతో సహాయక చర్యలు
- రసువా సహా 5 జిల్లాల్లో హై అలర్ట్
- లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- వరద పరిస్థితిపై అత్యవసర సమావేశం
- సహాయక చర్యలను వేగవంతం చేయాలని ప్రధాని ఆదేశం 02









నేపాల్‌లోని రసువా జిల్లాను బుధవారం ఉదయం సంభవించిన భీకర వరదలు గ్రామాలను ముంచెత్తాయి. భోటేకోషి నది ఒక్కసారిగా ఉప్పొంగడంతో ఆ ప్రాంతమంతా కకావికలమైంది. నదీ తీర ప్రాంతాల్లో ప్రశాంతంగా ఉన్న గ్రామాలు క్షణాల్లో జలమయమయ్యాయి. నీటి ప్రవాహం ఏ స్థాయిలో ఉందంటే, ఒడ్డున ఉన్న జనావాసాలు కొట్టుకుపోయి ఆనవాళ్లు లేకుండా పోయాయి. ఇందుకు సంబంధించిన దృశ్యాలు చూస్తేనే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. స్థానికులు వరద ఉధృతికి ఏ విధంగా కొట్టుకుపోయారో ఊహించుకుంటేనే గుండెలు...

## డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసం..

### ఎన్ఐఏ అధికారినంటూ మోసం



- 85 ఏళ్ల వృద్ధుడిని టార్గెట్ చేసిన సైబర్ నేరగాళ్లు
- ఎన్ఐఏ అధికారినంటూ డిజిటల్ అరెస్ట్ మోసం
- ఆర్బీఐ వెరిఫికేషన్ పేరుతో రూ.85.20 లక్షలు బదిలీ 02

## హైకోర్టు తీర్పుపై ఒవైసీ ఆగ్రహం

### హిజాబ్‌పై నిర్ణయించడానికి జడ్జీలు ఎవరు?



- హిజాబ్ తీర్పుపై ఒవైసీ తీవ్ర అభ్యంతరం
- హైకోర్టు తీర్పు రాజ్యాంగ హక్కులకు వ్యతిరేకమన్న ఒవైసీ
- "మతాచారాలపై నిర్ణయించే హక్కు న్యాయమూర్తులకు లేదు" 05



## పొంగులేటి నీ బాంబులు ఇవేనా?

**భూములు అమ్ముకుంటూ పోతే బొందల గడ్డ కోసం కూడా మిగలవు**

**22ఏ రద్దు చేయకపోతే సచివాలయం ముట్టడిస్తాం**

**ప్రజల భూముల కోసం పోరాడతామన్న బీఆర్ఎస్ నేతలు**

కూకట్‌పల్లి ప్రజలకు అన్యాయం జరుగుతోందన్న ఎమ్మెల్యే

- హరీష్ రావు తీవ్ర వ్యాఖ్యలు.. ప్రభుత్వంపై విమర్శలు
- ప్రజల భూముల విషయంలో కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ ఫైర్
- రేవంత్ సర్కార్ భూవిధానంపై హరీష్ రావు ధ్వజం
- ప్రభుత్వ నిర్ణయాలతో ప్రజలు భయపడుతున్నారన్న హరీష్
- భూముల వ్యవహారంలో అక్రమాలకు తావివ్వొద్దని డిమాండ్
- కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ నేతల తీవ్ర ఆరోపణలు
- ప్రజల ఆస్తుల రక్షణకు ఉద్యమిస్తామన్న బీఆర్ఎస్
- అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తామన్న హరీష్
- ప్రభుత్వ భూవ్యవహారాలపై ప్రతిపక్షం ఆగ్రహం 05
- కూకట్‌పల్లి ప్రజలకు అండగా ఉంటామన్న బీఆర్ఎస్
- ప్రభుత్వ విధానాలపై ప్రజా ప్రతినిధుల ఆగ్రహం
- రేవంత్ సర్కార్‌పై హరీష్ రావు ఘాటు విమర్శలు

## మరణమృదంగం



### 42 మంది ప్రయాణికులతో వెళ్తుండగా..

- స్పాట్లోనే ఆరుగురు ప్రయాణికులు మృతి
- మరో 20 మందికి గాయాలు
- మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు
- కంటైనర్ లోని ఇనుపరాడ్లు బస్సులోకి
- దూసుకురావడంతో ప్రమాద తీవ్రత 02
- ప్రమాదంపై రేవంత్ రెడ్డి, పవన్ కల్యాణ్, కేటీఆర్ దిగ్భ్రాంతి
- ప్రమాద స్థలంలోనే ఆరుగురు మృతి..

**మృతుల వివరాలివే..**

1. లొల్లి పోగు మేరీ జ్యోత్స్న (39), విజయవాడ
2. భావన(25). విజయవాడ.
3. పిడికిటి లక్ష్మీ (31), విజయవాడ.
4. యాసారపు చిన్ని(31) ఎన్టీఆర్ జిల్లా, తెల్లప్రోలు
5. షకీనా (24), భీమవరం
6. చెన్న కేశవుల నాగేంద్రబాబు(31), పడమట పల్లి, కృష్ణా జిల్లా

## ఆగివున్న కంటైనర్ను ఢీకొట్టిన బస్సు

# నేపాల్‌లో వరద బీభత్సం..

**నేపాల్ :** నేపాల్‌లోని రసువా జిల్లాను బుధవారం ఉదయం సంభవించిన భీకర వరదలు గ్రామాలను ముంచెత్తాయి. భోటేకోషి నది ఒక్కసారిగా ఉప్పొంగడంతో ఆ ప్రాంతమంతా కకావికలమైంది. నదీ తీర ప్రాంతాల్లో ప్రశాంతంగా ఉన్న గ్రామాలు క్షణాల్లో జలమయమయ్యాయి. నీటి ప్రవాహం ఏ స్థాయిలో ఉందంటే, ఒడ్డున ఉన్న జనావాసాలు కొట్టుకుపోయి ఆనవాళ్లు లేకుండా పోయాయి. ఇందుకు సంబంధించిన దృశ్యాలు చూస్తేనే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. స్థానికులు వరద ఉధృతికి ఏ విధంగా కొట్టుకుపోయారో ఊహించుకుంటేనే గుండెలు విసిగిపోతున్నాయి. ఈ దెబ్బకు రసువా జిల్లాలోని అనేక కీలక ప్రాంతాలు, మౌలిక వసతులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఉత్తరగయ గ్రామీణ మునిసిపాలిటీ ఉపాధ్యక్షురాలు చమేలీ గురుంగ్ తెలిపిన వివరాల ప్రకారం.. స్యాఫ్రూబెసి, బెత్రావతి, మైలుంగ్, సల్లెతార్, శాంతిబజార్, పైరేబెసి, ఖాల్తీ బస్తీ, సోలే, త్రిశూలి, బట్టార్ వంటి దాదాపు డజనుకు పైగా గ్రామాలు ఈ హఠాత్ వరద దాటికి గురయ్యాయి. ప్రస్తుతానికి మరణాలు, గాయపడినవారు, ఆస్తి నష్టానికి సంబంధించిన అధికారిక గణాంకాలను ప్రభుత్వం ఇంకా విడుదల చేయలేదు. అయితే స్థానిక అధికారులు, ప్రజలు, భద్రతా సంస్థల సమాచారం ప్రకారం నష్టం ఊహకందని స్థాయిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు 13 మృతదేహాలను వెలికితీయగా, వెయ్యి మందికి పైగా వరద నీటిలో కొట్టుకుపోయి ఉంటారని తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. బాధితులను కాపాడేందుకు రెస్క్యూ బృందాలు రంగంలోకి దిగాయి. నేపాల్ ఆర్మీ చీఫ్ వెల్లడించిన సమాచారం ప్రకారం ఈ ఫ్లాష్ ఫ్లడ్స్ వల్ల సుమారు 4,000 మందికి పైగా ప్రజలు తీవ్రంగా ప్రభావితులయ్యారు. పరిస్థితి అత్యంత గంభీరంగా మారడంతో నేపాల్ రెడ్ క్రాస్ తన ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లను వెంటనే అప్రమత్తం చేసి, సహాయక చర్యల్లోకి దించింది. ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్ క్రాస్ కూడా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, అవసరమైన సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించింది. మరోవైపు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, నదీ పరివాహక ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలకు దూరంగా వెళ్లి ప్రభుత్వ ఆదేశాలను పాటించాలని సూచించారు. సహాయక చర్యల కోసం నేపాల్ ప్రభుత్వం వెంటనే రెండు సైనిక హెలికాప్టర్లను రంగంలోకి దించింది. నేపాల్ ఆర్మీ, ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్, నేపాల్ పోలీసులను సహాయక చర్యల్లో భాగస్వాములను చేశారు. పరిస్థితి తీవ్రత దృష్ట్యా ఇతర జిల్లాల నుంచి కూడా అదనపు బలగాలను రసువా జిల్లాకు రప్పిస్తున్నారు. వరద తీవ్రతపై హోం మంత్రిత్వ శాఖ అత్యవసర సమావేశం నిర్వహించగా, ప్రధానమంత్రి బాలేంద్ర షా కూడా పరిస్థితులపై ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేసి సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ముందస్తు జాగ్రత్తగా దేశంలోని 5 జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించి, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు.

# డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** డిజిటల్ అరెస్టు మోసాలను స్వయంగా సుప్రీంకోర్టు సీరియస్‌గా తీసుకున్నా కేటుగాలు మాత్రం ఏ మాత్రం వెనకడుగు వేయడం లేదు. అమాయకులను బురిడీ కొట్టిస్తూ అందిన కాడికి దోచుకుంటున్నారు. తాజాగా డిజిటల్ అరెస్ట్ పేరుతో ఓ 85 ఏళ్ల రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగిని మోసం చేసిన సైబర్ నేరగాళ్ల నుంచి రూ.85.20 లక్షలను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు సకాలంలో స్పందించి కాపాడారు. మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని నేరేడ్‌మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది.

**ఎన్ఐఏ అధికారినంటూ మోసం:**

ఈ నెల 21వ తేదీన నేరేడ్‌మెట్‌కు చెందిన 85 ఏళ్ల వృద్ధుడికి ఎన్ఐఏ అధికారిగా నటిస్తూ ఒక వ్యక్తి నుంచి వీడియో కాల్ వచ్చింది. సదరు వ్యక్తి పోలీసు యూనిఫాం ధరించి, తెలుగులో మాట్లాడుతుండటంతో అతడు నిజమైన అధికారియేనని వృద్ధుడు నమ్మాడు. ఈ క్రమంలో బాధితుడి ఆధార్ వివరాలను 'అబ్దుల్ సలామ్' అనే వ్యక్తి దుర్వినియోగం చేసి కర్ణాటక, కేరళలో రూ.2.50 కోట్ల మోసపూరిత లావాదేవీలు, బ్యాంక్ ఖాతాలు తెరిచాడని నేరగాడు నమ్మబలికాడు. ఆర్బీఐ వెరిఫికేషన్ పేరుతో రూ. 85.20 లక్షలు తాను చెప్పిన ఓ బ్యాంకు ఖాతాకు బదిలీ చేయించుకున్నాడు. అంతే కాకుండా ఈ విషయాన్ని ఎవరికీ చెప్పకూడదని రహస్యంగా ఉంచాలని హెచ్చరించారు. లేకపోతే స్థానిక పోలీసులు ఇంటికి వచ్చి అరెస్టు చేస్తారని భయపెట్టాడు.

**మరోసారి డిమాండ్ చేయడంతో:**

ఆ తర్వాత మరో రూ.42 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేయడంతో బాధితుడికి అనుమానం వచ్చింది. వెంటనే తన బ్యాంక్‌ను సంప్రదించగా తాను సైబర్ మోసానికి గురయ్యానని గ్రహించాడు. దీంతో జాతీయ సైబర్ నేరాల రిపోర్టింగ్ పోర్టల్ (ద్వారా ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందిన వెంటనే రంగంలోకి దిగిన TGCSB అధికారులు సొమ్ము ఏ ఖాతాలోకి వెళ్లిందో వెతికి కోయంబత్తూరులోని ఐడీఎఫ్‌సీ బ్యాంక్ శాఖలోని నిందితుడి ఖాతాను వెంటనే ఫ్రీజ్ చేశారు. దీంతో బాధితుడు బదిలీ చేసిన రూ. 85.20 లక్షల పూర్తి మొత్తాన్ని అధికారులు సురక్షితంగా రక్షించగలిగారు. ఈ ఘటనపై మల్కాజిగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు మొదలు పెట్టారు.

# నేడు యువతతో ప్రధాని సంభాషణ..

**ఢిల్లీ :** జాతీయ క్రీడా దినోత్సవం-2026 సందర్భంగా నేడు (బుధవారం) ఉదయం 11:00 గంటలకు 'ఖేలో ఇండియా డైలాగ్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా పాల్గొని యువతను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. క్రీడలు, యువ నాయకత్వం, ఫిట్‌నెస్, దేశ నిర్మాణంపై యువతతో చర్చించనున్నారు. 'యువ సంవాద్'లోని కీలక అంశాలపై మాట్లాడనున్నారు. క్రీడా మౌలిక వసతులు, కోచింగ్, స్పోర్ట్స్ సైన్స్‌పై ప్రత్యేక చర్చ నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా ప్రతి జిల్లాలోని రెండు కళాశాలల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. మేరా యువ భారత్ ఆధ్వర్యంలో ఈ ఈవెంట్‌ను నిర్వహిస్తున్నారు.

**యువ నాయకులు పెరిగేలా..**

యువ నాయకత్వం, స్వచ్ఛంద సేవలను ప్రోత్సహించడం వంటి వాటిపై మోదీ ప్రసంగం ఉండనుంది. భవిష్యత్తు నైపుణ్యాలు, పౌర బాధ్యతపై ప్రధాని మోదీ దిశానిర్దేశం చేయనున్నారు. యువత ఆకాంక్షలు జాతీయ క్రీడా విధానంలో భాగం కావాలని ప్రధాని పిలుపునివ్వనున్నారు. అలాగే 2026 ఒలింపిక్స్ లక్ష్యంగా ప్రతిభావంతుల గుర్తింపు, శిక్షణలపై ఆయన చర్చ నిర్వహించనున్నారు.

**'నషా ముక్త్ యువ' ఉద్యమంపై ప్రత్యేక సంభాషణ**

ప్రధాని మోదీ 'నషా ముక్త్ యువ' ఉద్యమంపై యువతతో ప్రత్యేకంగా సంభాషించనున్నారు. క్రీడల ద్వారా మాదక ద్రవ్యాల వ్యసనాలను రూపుమాపడానికి ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో భాగంగా యువతతో ప్రముఖ భారత క్రీడాకారులు, పతక విజేతలు తమ అనుభవాలను పంచుకోనున్నారు. భవిష్యత్తు నిర్మాణానికి సూచనలు చేయనున్నారు.



# 'కులం' కాలమ్ తొలగింపు

**హిమాచల్‌ప్రదేశ్ :** పాఠశాల విద్యారంగంలో ఒక విప్లవాత్మకమైన మార్పులకు సరికొత్తగా హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల అడ్మిషన్ ఫారమ్‌ల నుంచి కులం కాలమ్‌ను శాశ్వతంగా తొలగిస్తున్నట్లుగా ప్రకటించింది. విద్యార్థుల మధ్య ఎలాంటి కుల వివక్షకు తావులేకుండా సమానత్వాన్ని పెంపొందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లుగా విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు.

**సమానత్వానికి పెద్దపీట..**

చిన్న వయస్సులోనే పిల్లల మనస్సులలో కుల భావనలు ఏర్పడకుండా నిరోధించడానికే అడ్మిషన్ ఫామ్ నుంచి కులం కాలమ్ తొలగింపు నిర్ణయ ప్రధాన ఉద్దేశమని విద్యాశాఖ పేర్కొంది. పాఠశాల ప్రవేశాల సమయంలో కులం పేరు ప్రస్తావించాల్సిన అవసరం లేనప్పటికీ, ప్రభుత్వ నిబంధనల ప్రకారం లభించే స్కాలర్‌షిప్స్, రిజర్వేషన్ల ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగదని అధికారులు స్పష్టం చేశారు. అయితే, హిమాచల్ ప్రదేశ్ నిర్ణయం పట్ల అక్కడి విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తల నుంచి ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. సమాజంలో కులరహిత వాతావరణాన్ని నిర్మించడానికి ఇది ఓ ఆదర్శవంతమైన అడుగు అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# భక్తుల చిరకాల ఆకాంక్షకు సాకారం..

## శ్రీ కోదండ రామాలయ నిర్మాణానికి శ్రీకారం



**మల్యాల,ఫ్లాష్ ఇండియా :** శ్రీ కోదండ రామాలయ నిర్మాణం భక్తుల చిరకాల ఆకాంక్ష అని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మల్యాల శివారులో నూతనంగా నిర్మించనున్న శ్రీ కోదండ రామాలయ మందిరానికి బుధవారం భూమి పూజ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు,వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. అలాగే ముందస్తు రాఖీ పండుగ సందర్భంగా 16 వ వార్డ్ మెంబర్ గాండ్ల జ్యోతివేణు ఆధ్వర్యంలో పలువురు మహిళలు ఎమ్మెల్యేకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, కరీంనగర్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ముత్యం శంకర్, సర్పంచులు బొట్ల జయప్రసాద్, దారం ఆదిరెడ్డి, శ్వేతఅంజిరెడ్డి, గాదం కుమార్, పాపారావు, గుర్రం విజయ్, సింగిల్ విండో చైర్మన్లు సతీష్ రెడ్డి, కొల్లూరు గంగాధర్, ఉప సర్పంచ్ లు కట్కం వినయ్, కంచర్ల లక్ష్మణ చారి, పొన్నం మల్లేశం, శనిగరపు తిరుపతి, బట్టు విజయ్, దూస వెంకన్న, రామలింగారెడ్డి, బీవీ రమణ పటేల్, రౌతు రవి, కోరేపు వెంకటేష్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# మరణమృదంగం

**కోదాడ అర్బన్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై సూర్యాపేట జిల్లా కోదాడ సమీపంలో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఏలూరుకు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దొరకుంట శివారు వద్ద రహ దారిపై ఆగి ఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులు అక్కడికక్కడే మృతిచెందగా, మరో 20 మందికి పైగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మృతులలో అయిదుగురు మహిళలు,ఒక పురుషుడు ఉన్నారు

**ఇనుప రాడ్లే ప్రాణాలు తీసాయా?**

ప్రమాద తీవ్రతను మరింత పెంచిన అంశం కంటైనర్లో తరలిస్తున్న ఇనుప రాడ్లుగా తెలుస్తోంది. బస్సు కంటైనర్ను ఢీకొన్న సమయంలో రాడ్లు ముందు భాగం అద్దాలను ఛేదించుకుని బస్సులోకి దూసుకెళ్లాయి. దీంతో ముందు భాగంలో ఉన్న ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం తెల్లవారుజామున జరగడంతో చాలా మంది ప్రయాణికులు గాఢ నిద్రలో ఉన్నారు. ఒక్కసారిగా జరిగిన ప్రమాదంతో వారు తేరుకునేలోపే ప్రాణాంతక పరిస్థితి ఏర్పడింది. ఇనుప రాడ్లను నిబంధనలకు విరుద్ధంగా, సరైన భద్రతా ఏర్పాట్లు లేకుండా తరలించారా అనే అంశంపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. రాడ్లను భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా రవాణా చేసి ఉంటే ప్రాణనష్టం ఈ స్థాయిలో ఉండేది కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**బస్సులో 42 మంది ప్రయాణికులు**

ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 42 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. చీకటి కారణంగా ఆగి ఉన్న కంటైనరు డ్రైవర్ సకాలంలో గుర్తించలేకపోయాడా? డ్రైవర్ నిద్రమత్తులో ఉన్నాడా?.. అనే కోణాల్లోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి ఖచ్చి తమైన కారణాలు దర్యాప్తు అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. సమాచారం అందుకున్న వెంటనే కోదాడ పోలీసులు, జాతీయ రహదారి భద్రతా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. బస్సులో ఇరుక్కుపోయిన ప్రయాణికులను బయటకు తీసేందుకు సహాయక బృందాలు తీవ్రంగా శ్రమించాయి. ఇనుప రాడ్ల మధ్య చిక్కుకున్న మృతదేహాలను బయటకు తీసేందుకు గ్యాస్ కట్టర్లను వినియోగిం చాల్సి వచ్చింది.

**ఆసుపత్రికి తరలింపు**

గాయపడినవారిని అంబులెన్స్ ద్వారా కోదాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి అత్యవసర చికిత్స అందిస్తున్నారు. కొందరి. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. దీంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందా అనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రమాదం కారణంగా హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదా రిపై భారీగా ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు క్రేన్ల సహాయంతో ప్రమాదానికి గురైన బస్సు, కంటైనర్ను రహదారి నుంచి తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

**సీఎం రేవంత్రెడ్డి దిగ్భ్రాంతి**

కోదాడ వద్ద జరిగిన ఘోర ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆరుగురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడం పట్ల విచారం వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి అత్యుత్తమ వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులపై నిబంధనలకు విరుద్ధంగా ఇనుప రాడ్లు వంటి ప్రమాదకర వస్తువులను తరలించే భారీ వాహనాలపై కఠిన నిఘా అవసరమని ఈ ప్రమాదం మరోసారి స్పష్టం చేస్తోంది.

**పవన్ కల్యాణ్ విచారం**

కోదాడ సమీపంలో జరిగిన ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదానికి సంబంధించిన వివరాలను అధి కారులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని, తెలంగాణ అధి కారులతో సమన్వయం చేసుకోవాలని సంబంధిత అధి కారులను ఆదేశించారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**కేటీఆర్ సంతాపం**

సూర్యాపేట జిల్లా కోదాడ సమీపంలో జరిగిన ప్రమాదం పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. క్షతగాత్రు లకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

**ప్రమాద క్షతగాత్రులకు మెరుగైన వైద్యం**

**అధికారులను ఆదేశించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ**

సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దుర్గాపురం స్టేజ్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులు మృతి చెందడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నట్లు తెలిపారు. ఈ విషాద ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో గాయపడి కోదాడ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. మరో 11 మంది క్షత గాత్రులను వారి విజ్ఞప్తి మేరకు అంబులెన్సుల ద్వారా విజయవాడ, ఏలూరు ఆసుపత్రులకు తరలించినట్లు వైద్య శాఖ అధికారులు మంత్రికి ఫోన్లో వివరించారు. మృతుల పూర్తి వివరాలను త్వరగా గుర్తించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. మృతదేహాలకు వేగంగా పోస్టుమార్టం నిర్వహించేందుకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని సూచించారు. పోస్టుమార్టం ప్రక్రియను త్వరగా పూర్తి చేసి మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.

# కోదాడలో గంజాయి ముఠా గుట్టురట్టు




**కోదాడ,ఫ్లాష్ ఇండియా :** యువత మత్తు పదార్థాలకు బానిసై భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోదాడ పట్టణ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలోని టౌన్ పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి వంటి మత్తు పదార్థాల విక్రయాలు, వినియోగంపై పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారని తెలిపారు. బోడిగుట్ట ప్రాంతంలో నమ్మదగిన సమాచారం మేరకు దాడి నిర్వహించిన పోలీసులు గంజాయి విక్రయదారులు, కొనుగోలుదారులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. కోదాడ పట్టణ పరిధిలోని బోడిగుట్ట వద్ద గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా గంజాయి విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరితో పాటు కొనుగోలు చేసేందుకు వచ్చిన మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారి వద్ద నుంచి సుమారు 1.100 కిలోల గంజాయి, మూడు ద్విచక్ర వాహనాలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి సాలె వేణు, ఉల్లెందుల సుదర్శన్, పోలంపల్లి సాయి సుమంత్, రేళ్ల గోపిలను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితుడిగా పేర్కొన్న పంకజ్ (బీహార్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి) ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతడిని పట్టుకునేందుకు ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అరెస్టు చేసిన నలుగురు నిందితులను విచారించిన అనంతరం కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు కోదాడ పట్టణ పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ శివశంకర్ కేసు వివరాలను వెల్లడించారు. యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాల వైపు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించారు. ఇటీవల మత్తు పదార్థాల ప్రభావంతో విద్యార్థులు సైతం నేరాలకు పాల్పడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. నల్గొండలో ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య కేసులో పదో తరగతి విద్యార్థులు ప్రధాన నిందితులుగా ఉండటం వంటి ఘటనలు సమాజంలో పునరావృతం కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ స్పష్టం చేశారు. యువతను మత్తు పదార్థాల బారినుంచి కాపాడేందుకు పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ శివశంకర్, ఎస్సైలు, అజయ్ కుమార్, ఉపేందర్ రెడ్డి, చిన్న మల్సూర్, ఏఎస్ఐ ఖయ్యూం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# టీ కాంగ్రెస్‌లో కీలక పరిణామం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రి కొండాసురేఖ వ్యవహారం రోజు రోజుకు ఉత్కంఠ రేపుతోంది. ఆమెపై అధిష్టానం ఎలాంటి చర్యలు తీసుకోబోతోందనే సస్పెన్స్ కొనసాగుతున్న వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. తాజాగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కొండా సురేఖ భర్త కొండా మురళి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విడివిడిగా భేటీ అయ్యారు. ఇవాళ ప్రజాభవన్‌లో భట్టిని కలిసి పార్టీలో ఇటీవల జరిగిన తాజా పరిణామాలపై చర్చించినట్లు సమాచారం. ఈ భేటీలో భట్టితో పాటు ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే మంత్రి కొండా సురేఖ కాంగ్రెస్ పార్టీ నియమావళిని ఉల్లంఘించడం ఇది మూడోసారని, అలాగే చిన్నారెడ్డి సైతం లైన్ దాటి మాట్లాడారని ఇక వీరిని ఉపేక్షిస్తే పార్టీకి తీవ్రనష్టం వాటిల్లుతుందని కాంగ్రెస్ రాష్ట్ర క్రమశిక్షణ వ్యవహారాల కమిటీ (డీఏసీ) పీసీసీ చీఫ్ కు నివేదిక సమర్పించింది. ఈ నేపథ్యంలో కొండాపై వేటు తప్పదనే చర్చ జరుగుతున్న వేళ కొండా మురళి భట్టీతే భేటీ కావడం ఆసక్తిగా మారింది.

**వేటు నుంచి తప్పించుకునేందుకేనా?**

భట్టితో రాజగోపాల్ రెడ్డి భేటీ కావడం హాట్ డిస్కషన్ గా మారింది. కొండా సురేఖ, చిన్నారెడ్డిపై వేటు వేస్తే అది తనపై కూడా చర్యలు తప్పవనే రాజగోపాల్ రెడ్డి అప్రమత్తమయ్యారా అనే టాక్ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించారని కొండా సురేఖ, చిన్నారెడ్డిపై చర్యలు తీసుకోవాల్సి వస్తే ఆ వెంటనే రాజగోపాల్ రెడ్డిపై కూడా చర్యలకు డిమాండ్ తెరపైకి వస్తుంది. ఈ నేపథ్యంలోనే వేటు నుంచి తప్పించుకునేందుకు ముందస్తుగా రాజగోపాల్ రెడ్డి భట్టి విక్రమార్కతో భేటీ అయ్యారా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

**మేం కాంగ్రెస్‌లోనే ఉంటాం: కొండా మురళి**

భటి విక్రమార్కతో భేటీ అనంతరం కొండా మురళి మీడియాతో మాట్లాడారు. మా బిడ్డ కొండా సుస్మిత వ్యాఖ్యలతో మాకు సంబంధం లేదన్నారు. ఆమె మనోభావాలు ఆమెకు ఉంటాయని ఆమెను ప్రశ్నించే హక్కు మాకు లేదన్నారు. మాకు గాంధీ కుటుంబంపై సంపూర్ణ విశ్వాసం ఉందని మేం కాంగ్రెస్‌లోనే కొనసాగుతామన్నారు. ఓ బిల్లు విషయంలో భట్టిని కలిశానన్నారు. కమిటీ నిర్ణయం వెలువడే వరకు ఏమీ మాట్లాడనన్నారు.



# నాకు సంబంధం లేదు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాజకీయాల్లో కొండా కుటుంబం చుట్టూ తిరుగుతున్న వివాదాలు, ప్రచారాలపై సీనియర్ నాయకుడు కొండా మురళి క్లారిటీ ఇచ్చారు. తమ కుటుంబం పార్టీ మారుతోందంటూ జరుగుతున్న ప్రచారాలను ఆయన ముమ్మాటికీ ఖండించారు. తాము కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేసిన ఆయన, తమకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ అంటే ఎంతో గౌరవం, అభిమానం ఉన్నాయని తెలిపారు.

**నా కూతురి ప్లాన్ బి ఏంటో నాకేం తెలుసు?**

తన కూతురు సుస్మిత వ్యాఖ్యలు, ఆమె చుట్టూ నడుస్తున్న వివాదంపై కొండా మురళి స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "సుస్మిత నా ఒక్కగానొక్క బిడ్డ. ఈ వివాదంతో నాకు ఎలాంటి సంబంధం లేదు. అది పూర్తిగా నా కూతురి వ్యవహారం. అందువల్ల ఈ వివాదంపై నేను మాట్లాడను" అని తేల్చిచెప్పారు. తన కూతురి ఆలోచనలు, ప్లాన్‌లు తనకెలా తెలుస్తాయని ప్రశ్నిస్తూ.. "ఆమె ప్లాన్-ఎ లో మాట్లాడింది, కానీ ప్లాన్-బి లో ఏం చేస్తుందో నాకేం తెలుసు? నా కూతురి ప్లాన్ నాకెలా తెలుస్తుంది?" అంటూ వ్యాఖ్యానించారు.

**పార్టీ మారేది లేదు.. భట్టితో భేటీపై స్పష్టత**

కాంగ్రెస్ పార్టీ మార్పుపై వస్తున్న వార్తలపై స్పందిస్తూ మీడియా తొందరపడాల్సిన అవసరం లేదని మురళి అన్నారు. "మేము పార్టీ మారడం లేదు, మీరేం ఆత్రుత పడాల్సిన అవసరం లేదు. ఈ విషయమై ఇవాల్టికి వరంగల్ కూడా వెళ్లలేదు" అని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో జరిగిన భేటీపై మాట్లాడుతూ, తాము కేవలం యోగక్షేమాలు మాట్లాడుకోవడానికే కలుసుకున్నామని, దానికి వేరే అర్థాలు తీయాల్సిన పనిలేదని స్పష్టం చేశారు.

# తెలంగాణ వేదికగా 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'

**న్యూఢిల్లీ :** భారతదేశ యువశక్తికి సరైన క్రీడా సదుపాయాలను, అవసరమైన ప్రోత్సాహాన్ని కల్పించి.. వారిలోని శక్తిసామర్థ్యాలకు పదునుపెట్టడంతోపాటుగా వారికి క్రీడా రంగంలో ఉజ్వలమైన భవిష్యత్తును అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది. అందుకోసం గత 12 ఏళ్లుగా వివిధ కార్యక్రమాలతోపాటు పథకాలను తీసుకొచ్చింది. 'ఖేలో ఇండియా' కార్యక్రమం ద్వారా.. దేశంలోని యువ క్రీడాశక్తిని ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా.. 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్', 'ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్', 'ఖేలో ఇండియా పారా గేమ్స్', 'ఖేలో ఇండియా వింటర్ గేమ్స్', 'ఖేలో ఇండియా బీచ్ గేమ్స్', 'ఖేలో ఇండియా వాటర్ స్పోర్ట్స్ ఫెస్టివల్', 'ఖేలో ఇండియా ట్రైబల్ గేమ్స్' వంటి క్రీడా పోటీల నిర్వహణ ద్వారా క్రీడాకారులు తమలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను, తమలోని నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఒక వేదికను ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు జరిగిన 24 ఎడిషన్ల 'ఖేలో ఇండియా ' పోటీల్లో దేశం నలుమూలల నుంచి 60 వేల మందికిపైగా క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పరంపరలో భాగంగా.. ఈ ఏడాది జరగనున్న 8వ ఎడిషన్ 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్' ను తెలంగాణలో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ వేదికగా ఈ పోటీలను నిర్వహించనున్నారు. ఈ ఎడిషన్‌లో మొత్తం 25 క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఆతిథ్య రాష్ట్రమైన తెలంగాణ.. ఒక స్థానిక క్రీడను ప్రతిపాదించవచ్చు. దీంతో పాటుగా మరో కొత్త క్రీడను కూడా ఈ ఈవెంట్లో ఆడించనున్నారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 6వేల మంది క్రీడాకారులు పాల్గొంటారని అంచనా. ఈ 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్' నిర్వహణకోసం.. కేంద్ర ప్రభుత్వం రూ. 22 కోట్లను విడుదల చేసింది. ఈ క్రీడా పోటీలను రాష్ట్ర ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా , నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ , స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా , సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, ఖేలో ఇండియా పథకం అడ్‌హక్ కమిటీ, స్టీరింగ్ కమిటీల సంయుక్త నిర్వహణలో నిర్వహించనున్నారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను తెలంగాణకు కేటాయించడం పట్ల.. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి, కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా శాఖల మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు ధన్యవాదాలు తెలియజేశారు. భారత యువతలో అపారమైన క్రీడా ప్రతిభ ఉందని, వారికి తగిన క్రీడా సదుపాయాలు కల్పించడం, అవసరమైన ప్రోత్సాహాన్ని అందించడం, ప్రతిభను వెలితీయడంలో గత ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహించాయని విమర్శించారు. స్పోర్ట్స్ బడ్జెట్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. 2014లో కేంద్రంలో మోదీ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత.. స్పోర్ట్స్ బడ్జెట్ కేటాయింపులు పెరిగాయని, ఖేలో ఇండియా వంటి పథకాల ద్వారా దేశంలోని మారుమూల ప్రాంతాలలో ఉన్న క్రీడా ప్రతిభకు సరైన ప్రోత్సాహం లభిస్తోందని పేర్కొన్నారు. 'ఖేలో ఇండియా' స్కీమ్‌లో భాగంగా.. తెలంగాణలో కూడా దాదాపు రూ. 30 కోట్లతో క్రీడా సదుపాయాల కల్పన జరిగిందని, అందులో రూ. 11.5 కోట్లతో ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో సింథటిక్ ట్రాక్, సింథటిక్ టెన్నిస్ కోర్ట్, మహిళల కోసం ప్రత్యేక స్విమ్మింగ్ పూల్ వంటి సౌకర్యాలను కల్పించారని, మరో రూ. 18.5 కోట్లతో రాష్ట్రంలోని వివిధ పట్టణాలలో క్రీడా సదుపాయాలను కల్పించారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో 33 ఖేలో ఇండియా సెంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేషనల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద మరో రూ. 8.5 కోట్లను తెలంగాణలో క్రీడాభివృద్ధికి ఖర్చు చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఖేలో ఇండియా స్కీమ్, టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ , అసిస్టెన్స్ టు నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా స్కీమ్ వంటి పథకాలు క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలనిస్తున్నాయి. తెలంగాణకు చెందిన అంతర్జాతీయ బాక్సర్ నిఖత్ జరీన్.. టాప్స్ ప్రోగ్రామ్ సహాయంతో ఇవాళ భారతదేశ కీర్తిపతాకను రెపరెపలాడిస్తోంది. ఈ పథకం ద్వారా ఆమెకు అత్యాధునిక శిక్షణతోపాటుగా అంతర్జాతీయ ఈవెంట్లలో పాల్గొని అనుభవం గడించేందుకు ప్రోత్సాహం లభించింది. తెలుగు తేజం.. బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు కూడా.. టాప్స్ కార్యక్రమం ద్వారా.. అంతర్జాతీయ స్థాయి శిక్షణ, సపోర్టింగ్ స్టాఫ్ సహకారంతో.. ఒలింపిక్స్ మెడల్ సాధించింది. క్రీడారంగంలో ఆమె రాణిస్తున్న తీరును ప్రోత్సహిస్తూ.. కేంద్ర ప్రభుత్వం 2015లో పద్మశ్రీ, 2020లో పద్మభూషణ్ అవార్డును అందించింది. ఇలాంటి క్రీడాకారులెందరికో.. కేంద్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది. 2014కు ముందు మొత్తం 23 ఒలింపిక్స్ ఎడిషన్లలో.. 23 పతకాలు సాధించగా.. 2014 నుంచి 2024 వరకు మూడు ఎడిషన్లలో 15 పతకాలు సాధించాం. పారాలింపిక్స్‌లోనూ.. 2014కు ముందు దేశం కేవలం 8 పతకాలు సాధించగా.. 2014 నుంచి 2024 పారాలింపిక్స్ లో.. 52 పతకాలు సాధించాం. 2014కు ముందు దేశంలో స్పోర్ట్స్ బడ్జెట్ రూ. 1,219 కోట్లుండగా.. 2025-26లో ఇది రూ. 3,794 కోట్లకు పెరిగింది. దేశంలో 2014కు ముందు రూ. 191 కోట్ల విలువైన 38 స్పోర్ట్స్ ప్రాజెక్టులుండగా.. ఈ 12 ఏళ్లలో 350 స్పోర్ట్స్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు పూర్తయ్యాయి. వీటి విలువ రూ. 3,181 కోట్లు. మరో వైపు, ఆగస్టు 29న నేషనల్ స్పోర్ట్స్ డే ను పురస్కరించుకుని.. గురువారం (ఆగస్టు 27న).. దేశవ్యాప్తంగా 'ఖేల్ కీ బాత్, పీఎం కే సాథ్' పేరుతో ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించనున్నారు. దేశ వ్యాప్తంగా ప్రతి జిల్లా నుంచి.. 2 కాలేజీల చొప్పున 1,500 లకు పైగా కాలేజీలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్రీడలు, ఫిట్‌నెస్‌తో పాటు యువత నేతృత్వంలో దేశ నిర్మాణానికి సంబంధించిన అంశాల మీద ప్రధాని మోదీ.. వర్చువల్‌గా ప్రసంగించడంతోపాటు క్రీడల పట్ల యువత ఆలోచనలు, ఆకాంక్షల గురించి వారితో మాట్లాడి తెలుసుకోనున్నారు.

# ధరణితోనే అనేక భూ సమస్యలు..

## గత ప్రభుత్వంపై వీహెచ్ ఫైర్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రభుత్వ సలహాదారుడు వి.హనుమంతరావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈరోజు(బుధవారం) గాంధీభవన్‌లో ప్రజలతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో వీహెచ్ పాల్గొన్నారు. ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రగతి భవన్‌ను కట్టి ప్రజల సమస్యలను చెప్పుకోవడానికి అవకాశాలు ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రగతి భవన్‌ను ప్రజా భవన్‌గా మార్చి ప్రజా సమస్యల పరిష్కార కేంద్రంగా మార్చారని తెలిపారు. గాంధీభవన్ కూడా ప్రజల సమస్యల పరిష్కార వేదిక అయ్యేలా ముఖాముఖీ కార్యక్రమం చేపట్టారని చెప్పారు.

**ఆ భూములపై అక్రమ రిజిస్ట్రేషన్లు**

ఈరోజు ముఖాముఖి కార్యక్రమంలో.. భూములకు సంబంధించిన సమస్యలే ఎక్కువగా తన దృష్టికి వచ్చినట్లు వీహెచ్ తెలిపారు. పటేల్ పట్వారి విధానం వల్ల భూ సమస్యలు తక్కువగా ఉండేవన్నారు. గత ప్రభుత్వం.. ధరణితో పాటు అనేక సమస్యలు తీసుకొచ్చిందని వ్యాఖ్యానించారు. నాడు ఇందిరా గాంధీ పంచిన భూములను మళ్లీ భూస్వాములు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్ ఆఫీసులో తప్పిదాలు జరుగుతున్నాయని.. రెవెన్యూ శాఖ మంత్రి పటిష్ట చర్యలు తీసుకోవాలని వి.హనుమంతరావు సూచించారు.

**వన్ నేషన్ వన్ ఎలక్షన్‌కు వ్యతిరేకం..**

వన్ నేషన్ వన్ ఎలక్షన్‌తో నరేంద్ర మోదీ నాలుగోసారి ప్రధాని అవ్వాలని చూస్తున్నారని వీహెచ్ అన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ అమెరికాలో సాధ్యమని.. భారత దేశంలో కాదన్నారు. ప్రధాని మోదీకి, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు సంబంధాలు ఉన్నాయని.. అందుకే భారత్‌ను అమెరికాలా చేయాలని మోదీ చూస్తున్నారని అన్నారు. భారత్ సెక్యులర్ దేశమని.. ఇక్కడ వన్ నేషన్ వన్ ఎలక్షన్ సాధ్యం కాదని చెప్పారు. భారత దేశంలో భిన్న మతాలు, భిన్న కులాల ఉన్నాయన్నారు. కేంద్రం చేస్తున్న క్యాస్ట్ సెన్స్, కులగణనలో బీసీల కాలమే లేదని తెలిపారు. అలాంటిది వన్ నేషన్ వన్ ఎలక్షన్ ఎక్కడిదని ప్రశ్నించారు. 70 శాతం ఉన్న బీసీలకు అన్యాయం చేస్తారా అంటూ నిలదీశారు. ముందు బీసీల సంగతి తేల్చాలన్నారు. 'మేము వన్ నేషన్ వన్ ఎలక్షన్‌కు వ్యతిరేకం' అని స్పష్టం చేశారు. కులగణన పేరుతో ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో ఉన్న ఓట్లకు, ఈసీ లెక్కలకు తేడా ఉందని వీహెచ్ పేర్కొన్నారు.

# ఇంటి ఆడబిడ్డగా వధువు మెడలో తాళి కట్టిన కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సాధారణంగా రాజకీయ నాయకులు సభలు, సమావేశాల ద్వారా ఇతర కార్యక్రమాల ద్వారా ప్రజలకు దగ్గరవుతుంటారు. కానీ కొన్ని సందర్భాల్లో వ్యక్తిగత అనుబంధాలకు ప్రాధాన్యమిస్తూ కుటుంబ సభ్యులుగా మారి ఆత్మీయతను చాటుకుంటారు. అలాంటి ఘటనే తెలంగాణ రాజకీయాల్లో చోటు చేసుకుంది. తమ పార్టీ నాయకుడి కోరిక మేరకు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ముదిరాజ్ కుటుంబానికి చెందిన ఇంటి ఆడబిడ్డగా మారి వధువు మెడలో తాళి కట్టిన వివాహాన్ని దగ్గరుండి జరిపించారు. ఈ వేడుకకు ఈసీఐఎల్ కీసర క్రాస్ రోడ్డులో ఆరాధ్య కన్వెన్షన్ వేదికగా నిలిచింది.

**పసుపు కొమ్ముతో మూడు ముళ్లు:**

యాదాద్రి భువనగిరి జిల్లా గూడూరు గ్రామానికి చెందిన బాషబోయిన బాలప్రసాద్ తెలంగాణ రక్షణ సేన నాయకుడు. తెలంగాణ జాగృతిలోనూ క్రియాశీలంగా పని చేశాడు. బాలప్రసాద్‌కు సీతాఫల్ మండికి చెందిన శివానితో వివాహం నిశ్చయం అయింది. బుధవారం ఉదయం బాలప్రసాద్ - శివాని వివాహ ముహూర్తం కాగా తనకు అక్కాచెల్లెళ్లు లేకపోవడంతో బాలప్రసాద్ కోరిక మేరకు వారి ఇంటి ఆడబిడ్డగా కవిత వ్యవహరించారు. ముదిరాజ్ కులాచారం ప్రకారం వరుడు వధువుకు తాళి కట్టే ముందు ఆడపడుచుతో పసుపు కొమ్ముతో మూడు ముళ్లు వేయిస్తారు. వారి సంప్రదాయం ప్రకారం కవిత గౌరీ పూజలో పాల్గొని వధువు శివాని మెడలో పసుపు కొమ్ముదారంతో మూడుముళ్లు వేశారు. ఉంగరపు వేలుకు ప్రదానపు ఉంగరం తొడిగారు. ఒడిబియ్యం పోసి పెళ్లి కుమార్తెను ఆశీర్వదించారు. అనంతరం బాలప్రసాద్ శివాని మెడలో మంగళసూత్ర ధారణ చేశారు.

# మాది అసలైన కాంగ్రెస్ రక్తం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో భేటీపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. నియోజకవర్గ అభివృద్ధి, నిధుల కోసమే భట్టిని కలిశానని చెప్పారు. తనపై విమర్శలు చేసేవారి గురించి తాను మాట్లాడనని తనను విమర్శిస్తున్న వారి స్థాయి ఏంటో తనను ఎందుకు విమర్శిస్తున్నారో ఓ సారి ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. ఇవాళ ప్రజాభవన్‌లో భట్టి విక్రమార్కతో భేటీ అనంతరం కొమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతల్లో తాను ఒకడినని, పార్టీ కష్టకాలంలో బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాటం చేసిన వాడినన్నారు. 2018 ఎన్నికల్లో పెద్ద పెద్ద లీడర్లు ఓటమి పాలైనా మునుగోడు ప్రజలు మాత్రం తనను గెలిపించారన్నారు. తెలంగాణలో ప్రతిపక్షమే లేకుండా చేయాలని చూసిన కేసీఆర్‌కు వ్యతిరేకంగా సర్వస్వం ధారపోసి కొట్లాడిన వ్యక్తిని నేనని అలాంటి నాపై మాట్లాడే వారు ఓ సారి ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. రాజగోపాల్ రెడ్డి అనునిత్యం తెలంగాణ ప్రజల అభివృద్ధి కోసం పాటుపడే వ్యక్తి అని అవినీతికి వ్యతిరేకంగా పని చేసే వ్యక్తి అన్నారు.

**నిజమైన కార్యకర్తలకు అన్యాయం జరగొద్దు:**

తెలగాణ గురించి తాను ఎంతగానో పోరాడానని నేను పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడలేదన్నారు. అలాగే వ్యక్తిగతంగా సీఎంను గానీ ఇతర నాయకులెవరినీ విమర్శించలేదన్నారు. ఎన్నికలప్పుడు పార్టీలోకి వచ్చిన వారికి టికెట్లు ఇవ్వడం, వారు గెలిచిన తర్వాత నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు నష్టం జరుగుతోందని వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత పార్టీపైన, అధిష్టానంపైన ఉందని చెప్పానన్నారు. ఇదే



విషయాన్ని మళ్లీ చెబుతున్నానన్నారు. నేను ఏదైనా మాట్లాడితే రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే తన లక్ష్యం అన్నారు. పార్టీ బలోపేతం కోసమే మాట్లాడుతాను తప్ప పార్టీని బలహీన పరిచేలా ఎప్పుడూ మాట్లాడనన్నారు. తెలంగాణలో నిజమైన, నిజాయితీపరులైన ఉద్యమాకారులు ఎంతో మంది ఉన్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారు ఉన్నత స్థాయి పదవుల్లో ఉండవచ్చు. అంత మాత్రాన నిజాయితీగా ఉద్యమంలో పోరాడిన వ్యక్తులను కించపరిచేలా కథనాలు రాయవద్దని హెచ్చరించారు. మాది అసలైన కాంగ్రెస్ రక్తం అన్నారు.

**కొండా సురేఖపై అధిష్టానం నిర్ణయమే ఫైనల్:**

కొండా సుస్మిత, చిన్నారెడ్డి వ్యాఖ్యలపై రాజగోపాల్ రెడ్డి స్పందించారు. వీరి విషయంలో అధిష్టానం నిర్ణయమే ఫైనల్ అన్నారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా చెప్పారని ఈ అంశంలో సీఎం మాటే నామాట అన్నారు. పార్టీ క్రమశిక్షణ కమిటీ ఉందని కొండా సురేఖ, చిన్నారెడ్డి వ్యాఖ్యలపై లోతైన అధ్యయనం చేసి పీసీసీ కి నివేదిక ఇచ్చారు. అధిష్టానం నిర్ణయాన్ని ఎవరూ కాదనలేమన్నారు.

**ఒళ్లు దగ్గర పెట్టుకోండి.. మర్యాద దక్కదు!**

కాంగ్రెస్ పార్టీ అంతర్గత విషయాలు, తనపై దుష్ప్రచారం చేస్తూ వార్తను వండివారుస్తున్న ఆంధ్ర మీడియాకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఓ రేంజ్‌లో వార్నింగ్ ఇచ్చారు. ఇవాళ ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఓ ప్రముఖ తెలుగు మీడియా సంస్థపై రాజగోపాల్ రెడ్డి నిప్పులు చెరిగారు. సదరు ఛానల్ ఎవరికి సపోర్ట్ చేస్తుందో తెలియదా అని ప్రశ్నించారు. కొంచెం ఒళ్లు దగ్గర పెట్టుకుని ఉంటే మంచిదని.. లేకుంటే మర్యాద దక్కదని ఫైర్ అయ్యారు. ఒకవేళ నా ప్రతాపమే చూపిస్తే ఆ ఛానల్, పేపరే ఉండదని.. సదరు మీడియా అధిపతికి చెబుతున్నానని రాజగోపాల్ రెడ్డి హెచ్చరించారు.

100 ఛానళ్లు పెట్టే సత్తా మాకుంది..

తెలంగాణ లో నిజమైన ఉద్యమకారులు, నిజాయితీపరులు ఎంతోమంది ఉన్నారని రాజగోపాల్ రెడ్డి అన్నారు. అసలైన కాంగ్రెస్ పార్టీ నేతలము తామని.. పార్లమెంట్‌లో ప్రత్యేక రాష్ట్రం గురించి కొట్లాడిన చరిత్ర తమదని తెలిపారు. మా లాంటి వ్యక్తులను కూడా కించపరిచే విధంగా, క్యారెక్టర్లను దెబ్బతీసేలా ఆంధ్రా వార్త పత్రికలు, న్యూస్ ఛానళ్లు వార్తలు రాస్తే మర్యాదగ ఉండదని అన్నారు. మీడియా , జర్నలిస్టులు అంటే తనకు అపారమైన గౌరవం ఉందని.. కానీ, మీడియా ముసుగులో తమ వ్యక్తిత్వాన్ని హననం చేద్దామని చూడటం మంచిది కాదన్నారు. తాను అన్ని మీడియా సంస్థలను అనడం లేదని.. ఎవరైతే కొందరు వ్యక్తులకు మాత్రమే పనిచేస్తూ కొమ్ము కాస్తున్నారో వాళ్లకు వార్నింగ్ ఇస్తున్నానని అన్నారు. తమకు కూడా 100 ఛానళ్లు పెట్టే దమ్ము, ధైర్యం ఉందని.. ఆంధ్రా మీడియా ఛానళ్ల సర్టిఫికెట్ మాకు అవసరమే లేదని ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అన్నారు.

# ఈనెల 28న పాన్‌గల్‌లో మంత్రి జూపల్లి సమీక్షా సమావేశం



**పాన్‌గల్,ఫ్లాష్ ఇండియా :** మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 28న శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పై మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమీక్షా సమావేశంలో జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొంటారని తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను దరఖాస్తు రూపంలో పేపర్ పై రాసి ఫోన్ నంబర్ 8185885127కు వాట్సాప్ ద్వారా పంపవలసిందిగా కోరారు. ఆ దరఖాస్తులను అధికారులకు పంపించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తారన్నారు. సమీక్షా సమావేశానికి మండల ప్రజలు హాజరై తమ సమస్యలను పరిష్కరించుకోవాల్సిందిగా కోరారు.



# పర్యావరణానికి పరీక్ష

## భక్తి పేరుతో చెరువులపై కాలుష్య భారం.. నిమజ్జనంపై ఇప్పటికైనా పకడ్బందీ చర్యలు అవసరం

### నిమజ్జనం తర్వాతే ఎందుకు మేల్కొనాలి?

ప్రతి సంవత్సరం గణేష్ నవరాత్రులు ప్రారంభమయ్యే ముందు నుంచే విగ్రహాల తయారీ మొదలవుతుంది. అదే సమయంలో అధికారులు కూడా పర్యావరణహిత ఉత్సవాలపై ప్రచారం ప్రారంభించాలి. కానీ చాలా సందర్భాల్లో నిమజ్జనం సమీపించే వరకు ఈ అంశంపై పెద్దగా చర్చ జరగదు. చివరి దశలో సమావేశాలు నిర్వహించడం, సూచనలు చేయడం, కొన్ని బ్యానర్లు ఏర్పాటు చేయడం వరకు మాత్రమే చర్యలు పరిమితమవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.నిజానికి కాలుష్య నియంత్రణ అనేది నిమజ్జనం జరిగే రోజున ప్రారంభించాల్సిన ప్రక్రియ కాదు. విగ్రహ తయారీ దశ నుంచే పర్యవేక్షణ అవసరం. ఏ పదార్థాలతో విగ్రహాలను తయారు చేస్తున్నారు? ఎలాంటి రంగులు ఉపయోగిస్తున్నారు? విగ్రహాల పరిమాణం ఎంత? నిమజ్జనం ఎక్కడ జరగాలి? నిమజ్జనం తర్వాత ఏర్పడే ఘన వ్యర్థాలను ఎలా సేకరించాలి? నీటి నాణ్యతను ఎలా పర్యవేక్షించాలి? వంటి అంశాలపై ముందుగానే కార్యాచరణ సిద్ధం చేయాలి.కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) మార్గదర్శకాలు కూడా నదులు, సరస్సులు, చెరువుల్లో నిమజ్జనాన్ని సాధ్యమైనంతవరకు నిర్దేశిత కృత్రిమ లేదా నియంత్రిత నిమజ్జన కుంటల్లో నిర్వహించే విధానాన్ని ప్రోత్సహిస్తున్నాయి. నిమజ్జనం తప్పనిసరిగా సహజ జల వనరుల్లోనే జరగాల్సిన పరిస్థితి ఉంటే, నిర్దిష్ట ప్రాంతాన్ని గుర్తించి భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచిస్తున్నాయి.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ప్రభుత్వాలు, కాలుష్య నియంత్రణ సంస్థలు పదేపదే చెబుతున్నాయి. జల వనరులను కాపాడుకోవాలి.. చెరువులు, కుంటలు, నదులను కాలుష్య రహితంగా ఉంచాలి.. నీటి వనరుల పరిరక్షణకు ప్రజలంతా సహకరించాలి అంటూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే పండుగల సమయంలో ఈ నిబంధనలు, సూచనలు ఎంతవరకు అమలవుతున్నాయన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్న. ముఖ్యంగా గణేష్ నవరాత్రుల సందర్భంగా జరిగే విగ్రహ నిమజ్జనం విషయంలో ప్రతి ఏటా ఒకే సమస్య పునరావృతమవుతున్నా, శాశ్వత పరిష్కారం దిశగా ముందస్తు కార్యాచరణ కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తోంది.గణేష్ ఉత్సవాలు మన సంస్కృతిలో ఎంతో విశిష్టమైనవి. భక్తి, ఐక్యత, సామాజిక చైతన్యానికి ఈ ఉత్సవాలు వేదికగా నిలుస్తాయి. అయితే పండుగ ముగిసిన తర్వాత అదే భక్తితో ప్రతిష్ఠించిన విగ్రహాలు చెరువుల్లో, కుంటల్లో నిమజ్జనం కావడం, వాటితో పాటు పీఓపీ, రసాయన రంగులు, ప్లాస్టిక్, థర్మాకోల్, ఇతర అలంకరణ వ్యర్థాలు నీటిలో చేరడం వల్ల పర్యావరణంపై అదనపు భారం పడుతోంది. భక్తిని కొనసాగిస్తూనే ప్రకృతిని కాపాడే మార్గాన్ని ఎంచుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.

### మట్టి విగ్రహాల వైపు మళ్లాల్సిన సమయం

పర్యావరణహిత గణేష్ ఉత్సవాలకు మట్టి విగ్రహాలు ఒక మంచి ప్రత్యామ్నాయం. స్థానికంగా లభించే మట్టితో తయారు చేసే విగ్రహాలకు ప్రాధాన్యం పెంచడం ద్వారా పర్యావరణంపై భారాన్ని తగ్గించవచ్చు. సహజ రంగుల వినియోగాన్ని కూడా ప్రోత్సహించాలి. అయితే కేవలం ప్రజలకు 'మట్టి విగ్రహాలనే వాడండి' అని చెప్పడం సరిపోదు. మట్టి విగ్రహాలు అందుబాటులో ఉండేలా స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు, కళాకారులకు ప్రోత్సాహం ఇవ్వాలి. ముందుగానే మట్టి విగ్రహాల తయారీ శిబిరాలను నిర్వహించాలి. పాఠశాలలు, కళాశాలల్లో పర్యావరణహిత విగ్రహాల తయారీపై అవగాహన కల్పించాలి.మట్టి విగ్రహాలకు డిమాండ్ పెరిగితే తయారీదారులకు కూడా మార్కెట్ ఏర్పడుతుంది. దీంతో క్రమంగా పీఓపీ విగ్రహాలపై ఆధారపడటం తగ్గే అవకాశం ఉంటుంది.



### చెరువులు కేవలం నిమజ్జన ప్రదేశాలు కావు

చెరువులు, కుంటలు మన పట్టణాలు, గ్రామాలకు కీలకమైన నీటి వనరులు. వర్షపు నీటిని నిల్వ చేయడం, భూగర్భ జలాల పునరుద్ధరణకు తోడ్పడటం, వ్యవసాయం, పశువులు, జీవ వైవిధ్యానికి ఉపయోగపడటం వంటి అనేక ప్రయోజనాలు వాటికి ఉన్నాయి. అందువల్ల చెరువులను వ్యర్థాల తుదిగమ్యంగా చూడటం ఎంతమాత్రం సమర్థనీయం కాదు.కాలుష్య నియంత్రణ వ్యవస్థలో నీటి నాణ్యత పర్యవేక్షణకు కీలక ప్రాధాన్యం ఉంది. సీపీసీబీ కూడా నీటి నాణ్యత పర్యవేక్షణను జలవనరుల నిర్వహణలో ముఖ్యమైన అంశంగా పేర్కొంటోంది.అలాంటి నీటి వనరుల్లో పండుగల సమయంలో పెద్ద మొత్తంలో ఘన వ్యర్థాలు, రసాయన పదార్థాలు చేరితే వాటి ప్రభావాన్ని శాస్త్రీయంగా అంచనా వేయాల్సిన అవసరం ఉంది. నిమజ్జనం ముందు, నిమజ్జనం సమయంలో, నిమజ్జనం తర్వాత నీటి నాణ్యతను పరీక్షిస్తే వాస్తవ పరిస్థితి మరింత స్పష్టంగా తెలుస్తుంది.

### పీఓపీతో అసలు సమస్య ఏమిటి?

గణేష్ విగ్రహాల తయారీలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ వినియోగం చాలా కాలంగా పర్యావరణ చర్చకు కారణమవుతోంది. పీఓపీ విగ్రహాలు నీటిలో సహజంగా త్వరగా కరిగిపోకపోవడం వల్ల నిమజ్జనం తర్వాత అవశేషాలు చెరువుల్లో మిగిలిపోతాయి. వాటిని బయటకు తీసి తరలించడం మరో సమస్యగా మారుతుంది.ఇక విగ్రహాలకు వేసే రంగులు, అలంకరణల్లో ఉపయోగించే పదార్థాలు నీటిలో చేరడం వల్ల నీటి నాణ్యతపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఒకే చెరువులో వందల సంఖ్యలో విగ్రహాలను నిమజ్జనం చేస్తే ఈ ప్రభావం మరింత పెరిగే అవకాశం ఉంటుంది. పండుగ ముగిసిన తర్వాత చెరువు నీటిపై ఏర్పడే మురుగు, తేలియాడే వ్యర్థాలు, విగ్రహాల అవశేషాలు, పూలు, వస్త్రాలు, ప్లాస్టిక్ తదితరాలను తొలగించేందుకు స్థానిక సంస్థలు పెద్ద ఎత్తున శ్రమించాల్సి వస్తుంది.ఇక్కడ ప్రధానంగా గుర్తించాల్సిన విషయం ఏమిటంటే.. ఒకరోజు జరిగే నిమజ్జనం వల్ల ఏర్పడే వ్యర్థాలను తొలగించేందుకు రోజుల తరబడి సమయం పడుతుంది. కొన్నిసార్లు విగ్రహాల అవశేషాలు చెరువు అడుగున పేరుకుపోయి తదుపరి శుభ్రతా చర్యలకు కూడా ఇబ్బందులు కలిగిస్తాయి. అందువల్ల నిమజ్జనాన్ని కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమంగా కాకుండా పర్యావరణ నిర్వహణలో భాగంగా చూడాలి.

### గంగమ్మకు ఎంత కష్టం?

11 రోజుల పాటు భక్తులతో పూజలందుకున్న గణనాథుడిని సాగనంపే సమయంలో భక్తుల్లో ఆధ్యాత్మిక భావోద్వేగం ఉంటుంది. కానీ నిమజ్జనం అనంతరం చెరువులో మిగిలిపోయిన విగ్రహాల అవశేషాలు, పూలు, ప్లాస్టిక్ సంచులు, అలంకరణ సామగ్రి, వస్త్రాలు తదితరాలు కనిపిస్తే అదే భక్తుల్లో ఆవేదన కలగడం సహజం.చెరువును శుభ్రం చేయడానికి పారిశుధ్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, ఇతర శాఖల సిబ్బంది రోజుల తరబడి పనిచేయాల్సి వస్తుంది. నీటిలోకి దిగి అవశేషాలను బయటకు తీయాల్సి రావడం మరింత ప్రమాదకరం. గజ ఈతగాళ్లు కూడా భారీ విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో తీవ్రంగా శ్రమించాల్సి వస్తుంది.అందుకే నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో ముందుగానే వ్యర్థాల సేకరణ బృందాలను ఏర్పాటు చేయాలి. నిమజ్జనం పూర్తయిన వెంటనే వ్యర్థాలను తొలగించే విధానం ఉండాలి. సీపీసీబీ మార్గదర్శకాలు కూడా నిమజ్జన ప్రాంతాల్లో ఏర్పడే వ్యర్థాలను శాస్త్రీయంగా నిర్వహించాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తున్నాయి.

కృత్రిమ నిమజ్జన కుంటలే మెరుగైన మార్గం పట్టణాలు, మున్సిపాలిటీల పరిధిలో భారీ సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనం అయ్యే ప్రాంతాల్లో కృత్రిమ నిమజ్జన కుంటలను ఏర్పాటు చేయడం అత్యంత ప్రయోజనకరమైన చర్య. సీపీసీబీ మార్గదర్శకాల్లో కూడా నిర్దేశిత కృత్రిమ కుంటలు లేదా ట్యాంకుల్లో నిమజ్జనాన్ని ప్రోత్సహించే విధానం ఉంది.ఇలాంటి కుంటలను ఏర్పాటు చేస్తే సహజ చెరువులపై పడే ఒత్తిడిని తగ్గించవచ్చు. నిమజ్జనం అనంతరం నీటిని శుద్ధి చేసి, ఘన వ్యర్థాలను వేరు చేసి నిర్వహించే అవకాశం ఉంటుంది. పూలు, ఆకులు, అలంకరణ వస్తువులను ముందుగానే విగ్రహాల నుంచి తొలగించి ప్రత్యేకంగా సేకరించాలి.సీపీసీబీ మార్గదర్శకాల ప్రకారం నిమజ్జన ప్రాంతాల్లోని పూలు, ఆకులు, కృత్రిమ అలంకరణలను ముందుగానే తొలగించి, నియంత్రిత ప్రాంతంలోనే నిమజ్జనం నిర్వహించాల్సిన విధానానికి ప్రాధాన్యం ఉంది.

### నిమజ్జనం తర్వాత బాధ్యత ఎవరిది?

సాధారణంగా విగ్రహం నీటిలోకి వెళ్లిన వెంటనే ఉత్సవ కమిటీ బాధ్యత ముగిసినట్టుగా భావించే పరిస్థితి కనిపిస్తుంది. అదే సమయంలో అధికారుల దృష్టి కూడా తదుపరి ఏర్పాట్ల వైపు మళ్లుతుంది. కానీ పర్యావరణ పరిరక్షణ పరంగా చూస్తే అసలు బాధ్యత అక్కడి నుంచే మొదలవుతుంది.నిమజ్జనం పూర్తయిన తర్వాత చెరువులో మిగిలిన విగ్రహాల అవశేషాలు, పూలు, వస్త్రాలు, ప్లాస్టిక్, థర్మాకోల్, ఇతర వ్యర్థాలను వెంటనే తొలగించాలి. వాటిని సాధారణ చెత్తతో కలపకుండా వేరు చేసి శాస్త్రీయంగా నిర్వహించాలి.నిమజ్జన కుంటల్లో సేకరించిన మురుగునీటిని కూడా నేరుగా కాలువల్లోకి లేదా సహజ నీటి వనరుల్లోకి వదలకూడదు. సీపీసీబీ మార్గదర్శకాలు తాత్కాలిక నిమజ్జన కుంటల నుంచి వచ్చే నీటికి అవసరమైన ముందస్తు శుద్ధి అనంతరం తగిన మురుగునీటి శుద్ధి వ్యవస్థలకు తరలించే విధానాన్ని సూచిస్తున్నాయి.

### భద్రత విషయంలోనూ నిర్లక్ష్యం వద్దు

విగ్రహ నిమజ్జనం కేవలం కాలుష్య సమస్య మాత్రమే కాదు.. ఇది ప్రజా భద్రతకు సంబంధించిన అంశం కూడా. భారీ విగ్రహాలను వాహనాలపై తరలించే సమయంలో విద్యుత్ తీగలు, ట్రాఫిక్, రహదారి పరిస్థితులు, వాహన సామర్థ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.నిమజ్జన ప్రదేశాల్లో జారి పడే ప్రమాదం, నీటిలో మునిగిపోయే ప్రమాదం, భారీ విగ్రహాలు కూలే ప్రమాదం వంటి అంశాలను ముందుగానే అంచనా వేయాలి. ప్రమాదకర ప్రాంతాల్లో బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలి. రక్షణ సిబ్బంది, గజ ఈతగాళ్లు, అత్యవసర వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచాలి.సీపీసీబీ మార్గదర్శకాలు కూడా సహజ జల వనరుల్లో నిమజ్జనం తప్పనిసరి అయిన సందర్భాల్లో నిర్దిష్ట ప్రాంతాన్ని ఎంపిక చేసి భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచిస్తున్నాయి.

### ఎత్తైన విగ్రహాలపై కూడా పర్యవేక్షణ అవసరం

విగ్రహాల పరిమాణం పెరుగుతున్న కొద్దీ వాటిని తరలించడం, నిమజ్జనం చేయడం కూడా సవాలుగా మారుతోంది. భారీ విగ్రహాలను చెరువుల్లోకి తీసుకెళ్లడం కోసం క్రేన్లు, భారీ వాహనాలు, తాళ్లు, ఇతర పరికరాలు ఉపయోగించాల్సి వస్తుంది. ఈ సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణనష్టానికి దారితీయవచ్చు.అందువల్ల విగ్రహాల తయారీ, రవాణా, నిమజ్జన ప్రక్రియపై స్థానిక అధికారులు ముందుగానే మార్గదర్శకాలు రూపొందించాలి. భారీ విగ్రహాలకు ప్రత్యేక మార్గాలు, ప్రత్యేక సమయాలు కేటాయించడం ద్వారా రద్దీని తగ్గించవచ్చు.

### ప్రచారం కంటే అమలు ముఖ్యం

పర్యావరణహిత గణేష్ ఉత్సవాలపై ప్రతి ఏడాది ప్రచారం జరుగుతోంది. పోస్టర్లు, బ్యానర్లు, సామాజిక మాధ్యమాల్లో సందేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కానీ ప్రచారం తర్వాత అమలు లేకపోతే ఆ ప్రయత్నాల ఫలితం పరిమితంగానే ఉంటుంది.కాబట్టి ఈసారి కార్యాచరణకు స్పష్టమైన లక్ష్యాలు ఉండాలి. ప్రతి మున్సిపాలిటీ పరిధిలో ఎన్ని నిమజ్జన కేంద్రాలు? ఎక్కడ కృత్రిమ కుంటలు? ఎంతమంది సిబ్బంది? ఎన్ని రక్షణ బృందాలు? ఎన్ని వ్యర్థ సేకరణ వాహనాలు? నీటి నాణ్యతను ఎప్పుడు పరీక్షించాలి? నిమజ్జనం అనంతరం ఎన్ని గంటల్లో శుభ్రపరిచే ప్రక్రియ పూర్తవ్వాలి? వంటి అంశాలను ముందుగానే నిర్ణయించాలి.

### కాలుష్య నియంత్రణ మండలి పాత్ర కీలకం

కాలుష్య నియంత్రణ మండలి ఈ మొత్తం ప్రక్రియలో కేవలం సలహా ఇచ్చే సంస్థగా కాకుండా శాస్త్రీయ పర్యవేక్షణ చేసే సంస్థగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ముఖ్యమైన చెరువులు, నిమజ్జన కేంద్రాలను గుర్తించి నిమజ్జనం ముందు మరియు తర్వాత నీటి నాణ్యతను పరీక్షించాలి.పర్యావరణ నిబంధనలు ఉల్లంఘించే విగ్రహ తయారీ యూనిట్లు, అధిక కాలుష్యకారక పదార్థాల వినియోగం, నిషేధిత వస్తువుల వినియోగం వంటి అంశాలపై తనిఖీలు నిర్వహించాలి. స్థానిక సంస్థలతో కలిసి సమన్వయ చర్యలు చేపట్టాలి.సీపీసీబీ కి నీటి కాలుష్య పర్యవేక్షణ, సాంకేతిక సమాచార సేకరణ, నీటి నాణ్యత పర్యవేక్షణ వంటి బాధ్యతలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పండుగల సమయంలో జరిగే నిమజ్జన ప్రభావాన్ని కూడా శాస్త్రీయ డేటా ఆధారంగా అంచనా వేయడం అవసరం.

### ఉత్సవ కమిటీల బాధ్యత కూడా అంతే

పర్యావరణ పరిరక్షణ బాధ్యత పూర్తిగా ప్రభుత్వంపైనే ఉందని భావించడం సరికాదు. గణేష్ ఉత్సవ కమిటీలు కూడా ఇందులో భాగస్వాములు కావాలి. విగ్రహం ఎంపిక నుంచి నిమజ్జనం వరకు






పర్యావరణ ప్రమాణాలను పాటించాలి.

మట్టి విగ్రహాలను ప్రోత్సహించడం, సహజ రంగులను ఉపయోగించడం, ప్లాస్టిక్, థర్మాకోల్ అలంకరణలను తగ్గించడం, పూజా సామగ్రిని ప్రత్యేకంగా సేకరించడం, నిమజ్జన ప్రాంతంలో పారిశుధ్యాన్ని కాపాడటం వంటి చర్యలను కమిటీలు స్వచ్ఛందంగా చేపట్టాలి.భక్తి అంటే ప్రకృతిని నిర్లక్ష్యం చేయడం కాదు. ప్రకృతిని గౌరవించడం కూడా భక్తిలో భాగమే అనే భావనను ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

### ప్రజల భాగస్వామ్యం లేకుండా సాధ్యం కాదు

చివరికి పర్యావరణ పరిరక్షణలో ప్రజల పాత్ర అత్యంత కీలకం. అధికారులు ఎన్ని నిబంధనలు పెట్టినా ప్రజలు సహకరించకపోతే ఆశించిన ఫలితాలు రావు. అందుకే నిమజ్జనానికి వెళ్లే ప్రతి కుటుంబం, ప్రతి ఉత్సవ కమిటీ తమ బాధ్యతను గుర్తించాలి.విగ్రహంతో పాటు పూలు, ప్లాస్టిక్, వస్త్రాలు, అలంకరణ సామగ్రిని నీటిలో వేయకుండా ప్రత్యేకంగా సేకరించాలి. సాధ్యమైనంతవరకు మట్టి విగ్రహాలను ఎంచుకోవాలి. పర్యావరణహిత రంగులు ఉపయోగించాలి. నిర్దేశిత నిమజ్జన కేంద్రాలనే వినియోగించాలి.

### ప్రతి ఏడాది ఇదే దృశ్యం ఎందుకు?

ప్రతి సంవత్సరం నిమజ్జనం అనంతరం చెరువులను శుభ్రం చేస్తాం. అవశేషాలను తొలగిస్తాం. చెత్తను తరలిస్తాం. నీటిని పరీక్షిస్తాం. ఆ తర్వాత కొన్ని నెలలు గడిచిన వెంటనే అదే సమస్యను మళ్లీ ఎదుర్కొంటాం. అంటే సమస్యను పరిష్కరించడం కాకుండా ప్రతి సంవత్సరం దాని పరిణామాలను మాత్రమే నిర్వహిస్తున్నాం.ఇది మారాల్సిన సమయం వచ్చింది.పర్యావరణ పరిరక్షణ అంటే నిమజ్జనం జరిగిన తర్వాత చెరువును శుభ్రం చేయడం మాత్రమే కాదు. కాలుష్యం ఏర్పడకుండా ముందుగానే చర్యలు తీసుకోవడం అసలు పరిరక్షణ. అందుకే ఈ ఏడాది నుంచే శాశ్వత విధానాన్ని రూపొందించాలి.

### భక్తి, సంప్రదాయం, పర్యావరణం.. మూడింటి మధ్య సమతుల్యత అవసరం

గణేష్ ఉత్సవాలు కొనసాగాలి. భక్తి కొనసాగాలి. సంప్రదాయాలు కొనసాగాలి. అయితే అదే సమయంలో ప్రకృతి కూడా కాపాడబడాలి. ఒకదానిని కాపాడటానికి మరొకదాన్ని నాశనం చేయాల్సిన అవసరం లేదు.మట్టి విగ్రహాలు, సహజ రంగులు, కృత్రిమ నిమజ్జన కుంటలు, శాస్త్రీయ వ్యర్థ నిర్వహణ, నీటి నాణ్యత పర్యవేక్షణ, భద్రతా ఏర్పాట్లు, ప్రజల భాగస్వామ్యం వంటి చర్యలను సమర్థంగా అమలు చేస్తే పర్యావరణహిత గణేష్ ఉత్సవాలు సాధ్యమే.చెరువు మన పండుగకు ముగింపు వేదిక మాత్రమే కాదు.. అది భవిష్యత్ తరాల జీవనాధారం. భక్తితో గణనాథుడిని పూజించిన మనం.. అదే భక్తితో ఆయన నిమజ్జనం జరిగే నీటి వనరును కూడా కాపాడాలి.ప్రతి ఏడాది నిమజ్జనం తర్వాత చెరువుల దుస్థితిపై ఆవేదన వ్యక్తం చేయడం కంటే.. ఈసారి నిమజ్జనం మొదలయ్యే ముందే పకడ్బందీ చర్యలు ప్రారంభించాలి. ప్రభుత్వ శాఖలు, కాలుష్య నియంత్రణ మండలి, స్థానిక సంస్థలు, పోలీసు, ఉత్సవ కమిటీలు, పర్యావరణ సంస్థలు, ప్రజలు కలిసి పనిచేస్తేనే ఈ మార్పు సాధ్యమవుతుంది.పండుగను ఘనంగా నిర్వహించడం ఎంత ముఖ్యమో.. పండుగ అనంతరం ప్రకృతిని నిర్మలంగా ఉంచడం అంతకంటే ముఖ్యమైన బాధ్యత.పర్యావరణ పరిరక్షణపై ప్రభుత్వ ప్రకటనలు కార్యాచరణగా మారాలి. నిబంధనలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలవ్వాలి. గణేష్ నవరాత్రులు భక్తికి ప్రతీకగా నిలవాలి కానీ చెరువుల కాలుష్యానికి కారణంగా మారకూడదు. అదే నిజమైన పర్యావరణ బాధ్యత.. అదే భావితరాలకు మనం అందించాల్సిన పండుగ వారసత్వం.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539
flashindia999@gmail.com



## ప్లాస్టిక్ రహిత గ్రామమే వారి లక్ష్యం..!

**అలంపూర్,ఫ్లాష్ ఇండియా :** ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొట్టేందుకు జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల పరిధిలోని ఏ-బూడిదపాడుకు చెందిన షేక్ బషీర్ భాషా తన మిత్రులతో కలిసి గ్రామంలో విస్తృత అవగాహన ప్రచారం నిర్వహించారు. స్థానిక వ్యాపారులకు ప్లాస్టిక్ సంచుల వల్ల పశువుల జీర్ణక్రియ దెబ్బతిని చనిపోవడం, పొలాల్లో భూసారం తగ్గడం వంటి నష్టాలను వివరించారు. నిత్యం ప్లాస్టిక్ సామాన్లు పెట్టుకోవడం, కూరగాయలు అందులో ఉంచుకొని ఫ్రిజ్ లో పెట్టుకోవడంతో రోగాల బారిన పడతారని తెలియజేశారు. అనంతరం కిరాణా షాపులకు ఉచితంగా బట్ట సంచులను అందజేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ గుడ్డ సంచులే వాడాలని బషీర్ భాషా కోరారు. వినూత్నంగా ప్రచారం చేస్తూ ప్రతి షాపునకు బట్టల సంచులు అందజేయడంతో గ్రామస్తులందరూ అభినందించారు. ప్రతి ఒక్కరు ఇంట్లో ప్లాస్టిక్ వాడకుండా బట్టలతో తయారుచేసిన బ్యాగులను ఇప్పటి నుండి వాడుదామని గ్రామస్తులు కూడా తెలిపారు.

## ట్రంప్ సర్కార్ భారీ షాక్..

**అమెరికా :** అమెరికా వీసా కోసం ఎదురుచూస్తున్నవారికి ట్రంప్ సర్కార్ ఊహించని షాక్ ఇచ్చింది. ప్రపంచవ్యాప్తంగా వీసా అపాయింట్మెంట్లు తాత్కాలికంగా నిలివేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే బుక్ అయిన వీసా ఇంటర్వ్యూలను సైతం రీషెడ్యూల్ చేస్తోంది. కాన్సులర్ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు, వీసా దరఖాస్తుదారులపై మరింత కఠిన పరిశీలన కోసమే ఈ చర్యలు తీసుకుంటున్నట్టు అమెరికా విదేశాంగశాక స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని యూఎస్ ఎంబసీలు, కాన్సులేట్ లలోని సిబ్బంది కోసం ప్రత్యేక గ్లోబల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ప్రారంభించనున్నట్టు యూఎస్ స్టేట్ డిపార్ట్ మెంట్ అధికార ప్రతినిధి వెల్లడించారు. ఈ శిక్షణకు అనుగుణంగా వీసా సర్వీస్ అపాయింట్మెంట్ లలో మార్పులు చేసినట్టు తెలిపారు. మరోవైపు ఇప్పటికే ఇంటర్వ్యూలు షెడ్యూల్ చేసుకున్న వీసా దరఖాస్తుదారులకు వారి అపాయింట్మెంట్లు రద్దు చేసినట్టు ఈమెయిల్స్ చేశారు. వారి అపాయింట్మెంట్లకు సంబంధించి కొత్త తేదీ, సమయం గురించి తరవాత తెలియజేస్తామని మెయిల్ లో స్పష్టం చేశారు. అయితేక యూఎస్ ఎంబసీలు, కాన్సులేట్ లలో సిబ్బందికి అందిస్తున్న శిక్షణ గురించి, అది ఎంతకాలం కొనసాగుతుందనే దాని గురించి అమెరికా విదేశాంగ శాఖ వివరాలను వెల్లడించలేదు. ఇదిలా ఉంటే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వలసలపై ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. తాజాగా ఆయన తీసుకున్న నిర్ణయంతో అమెరికా వీసా పొందడం మరింత కష్టతరమయ్యే ఛాన్స్ ఉంది.

## బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితికి వ్యతిరేకంగా నిరసన

**బడంగ్ పేట్,ఫ్లాష్ ఇండియా :** బాలాపూర్ ఉత్సవ సమితిలో కేవలం అగ్రవర్ణాలు మాత్రమే ఉంటూ బడుగు బలహీన వర్గాల ప్రజలను దూరం పెడుతున్నారని తమ ఆవేదన వ్యక్తం చేస్తూ బాలాపూర్ గణేష్ మండపం వద్ద బుధవారం నిరసన ధర్నా చేపట్టారు. అన్ని వర్గాల ప్రజలను ఆ కమిటీలో చేర్చుకోవాల్సిన బాధ్యత గణేష్ ఉత్సవ సమితికి ఉందని బొర్ర రవి అన్నారు. గణనాథుడికి సేవ చేసే భాగ్యం తమకు కూడా కల్పించాలని డిమాండ్ చేశారు. బాలాపూర్ లడ్డూ రెడ్డి వర్గాలకే వరాలు ఇస్తున్నారని, కమిటీ సభ్యులను ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు. హుండీ ఆదాయం, లెక్కలు కూడా బహిర్గతం చేయబోరని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇలాగే మొండి వైఖరికి దిగితే, తమ భవిష్యత్తు కార్యచరణ ప్రకటిస్తామని, ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో అదే ప్రాంతానికి చెందిన పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి వారు చేస్తున్న నిరసన ధర్నాకు మద్దతు ప్రకటించారు.

# ఇల్లంతకుంటలో ఎస్సై కుర్చీకి గ్రహణం !




**ఇల్లంతకుంట,ఫ్లాష్ ఇండియా :** రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని ఇల్లంతకుంట మండలం.. మానకొండూరు నియోజకవర్గంలో కీలక మండలం. జిల్లాలోనే పెద్ద మండలాల్లో ఒకటిగా ఉన్న ఇల్లంతకుంటలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్‌స్టేషన్‌కు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. మండలం విస్తీర్ణం, గ్రామాల సంఖ్య, ప్రజల అవసరాల దృష్ట్యా పోలీస్‌స్టేషన్ పై బాధ్యత కూడా ఎక్కువే. కానీ.. ఇక్కడ ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన అధికారులు మాత్రం ఎక్కువ కాలం కొనసాగలేని పరిస్థితి నెలకొన్నదనే చర్చ తీవ్రంగా ఉంది. గత ఆరేళ్ల కాలంలో దాదాపు 12 మంది ఎస్సైలు ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీ కావడం గమనార్హం. అంటే సగటున ఆరు నెలలకు ఒక ఎస్సై చొప్పున మారిన పరిస్థితి కనిపిస్తోంది. గతంలో ఇక్కడ పనిచేసిన పలువురు ఎస్సైలు ఏడాది కూడా పూర్తి కాకముందే బదిలీ పై వెళ్లిపోయారు. ఒకరు వచ్చిన కొద్దికాలానికే వెళ్లిపోవడం.. మరొకరు బాధ్యతలు చేపట్టగానే బదిలీ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందనే చర్చ స్థానికంగా ఉంది.

### రాజకీయ ఒత్తిళ్లా.. ఇసుక మాఫియా బెడదా ?

ఇల్లంతకుంటలో ఎస్సైగా విధులు నిర్వహించడం అంత సులభం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అటు రాజకీయ ఒత్తిళ్లు.. ఇటు ఇసుక మాఫియా వ్యవహారాలు.. మధ్యలో పోలీసుల విధులు అన్నట్టుగా పరిస్థితి ఉండేదని స్థానికంగా ప్రచారం ఉంది. ఇసుక అక్రమ రవాణా, ఇతర వివాదాస్పద వ్యవహారాల విషయంలో పోలీసుల పై ఒత్తిళ్లు ఉండేవని ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాజకీయంగా ఎవరికైనా అనుకూలంగా ఉన్నా.. వ్యతిరేకంగా ఉన్నా.. పరిస్థితులు మారగానే బదిలీ కావాల్సి వచ్చేదనే చర్చ కూడా ఉంది. దీంతో ఇక్కడ ఎస్సై పోస్టు స్థిరమైన బాధ్యత కంటే తాత్కాలిక పోస్టుగా మారిపోయిందా ? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.


### 15 నెలలు కొనసాగిన అశోక్..

అయితే ఈ బదిలీల పరంపరలో సిరిసిల్ల అశోక్ కొంత భిన్నంగా నిలిచారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఆయన ఇల్లంతకుంట నుంచి తంగళ్లపల్లికి బదిలీ అయ్యారు. ఇల్లంత కుంటలో సుమారు 15 నెలల పాటు విధులు నిర్వహించిన అశోక్.. గత ఆరేళ్లలో ఏడాది దాటి కొనసాగిన ఎస్సైగా నిలిచారు. ఆయన హయాంలో కూడా పలు సవాళ్లు ఎదురైనప్పటికీ.. 15 నెలల పాటు విధులు కొనసాగించడం ఇప్పుడు చర్చకు కారణమైంది. సాధారణ బదిలీల్లో భాగంగా అశోక్ తంగళ్లపల్లికి వెళ్లడంతో ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్‌లో మరోసారి ఎస్సై మార్పు చోటుచేసుకుంది.

### అశోక్ స్థానంలో ఉపేంద్రచారి..

తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించిన ఉపేంద్రచారి బదిలీ పై ఇల్లంతకుంటకు వచ్చారు. తాజాగా బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఆరేళ్లలో మరోసారి ఇల్లంతకుంట పోలీస్‌స్టేషన్ ఎస్సై మారారు.

# పొంగులేటి నీ బాంబులు ఇవేనా?



**కూకట్‌పల్లి,ఫ్లాష్ ఇండియా :** 22ఏ ఎత్తేయకపోతే సచివాలయం ముట్టడిస్తామని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం వసంత్‌నగర్ డివిజన్‌లో 22ఏ పరిధిలోకి వచ్చిన కాలనీ వాసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ప్రతినిధుల సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ, మల్కాజిగిరి బీఆర్ఎస్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పాలన ప్రజల కోసం జరిగితే, కాంగ్రెస్, రేవంత్ రెడ్డి పాలన భూముల చుట్టూ జరుగుతుందని ఆరోపించారు. రాత్రికి రాత్రే కోట్ల ఎకరాల భూములు 22ఏ నిషేధిత జాబితాలోకి చేర్చారని, ప్రజల నుంచి, ప్రతిపక్షాల నుంచి వ్యతిరేకత వచ్చిన తరువాత సారీ చెప్పి 22ఏ నుంచి తొలగించడానికి దరఖాస్తు పెట్టుకోమని అంటున్నారని, దరఖాస్తు చేసుకున్న తర్వాత వారి ఫోన్ నంబర్లు తీసుకుని బేరాలు చేయడానికి చూస్తున్నారని, 30 శాతం కమిషన్ మీద 22ఏ నుంచి భూములను తొలగించేందుకు బేరాలు చేస్తున్నారని అన్నారు. మర్డర్ చేసి సారీ చెబితే అయిపోతుందా అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు 22ఏ, హైడ్రా పేరుతో గుండెల మీద చేయి వేసుకుని భయంతో నిద్రపోతున్నారని అన్నారు. రాష్ట్రంలో ఉన్న భూములు అన్నీ అమ్ముకుంటే బొంద పెట్టడానికి కూడా భూములు మిగలవని అన్నారు. విద్యాసంస్థలు, హాస్పిటళ్లకు, స్కూళ్లకు, యూనివర్సిటీలకు భూములు ఇవ్వాల్సిన రేవంత్ రెడ్డి, విద్యా సంస్థల భూములను అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ప్రజలకు భూములు ఇవ్వాల్సిన ప్రభుత్వం, ఎస్సీ, ఎస్టీల భూములు, అసైన్డ్ భూములను లాక్కుని వ్యాపారవేత్తలకు అప్పగిస్తున్నారని, తన తమ్ముడికి వందల కోట్ల భూములను కట్టబెట్టారని ఆరోపించారు. 22ఏ పేరుతో ఆందోళన చేస్తున్న వారిని కించపరుస్తున్నారని, కబ్జాదారులు ధర్నాలు చేస్తున్నారంటూ ఆరోపిస్తున్నారని అన్నారు. సర్వేనంబర్ 145, 163లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న వారు, 7 పదుల వయస్సు కలిగిన వృద్ధులు కబ్జాదారులా ? ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్న వారి భూములను లాక్కోవడానికి చూస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో గజం భూమి అమ్మలేదని, రేవంత్ వచ్చిన తర్వాత లక్షల కోట్ల విలువ చేసే భూములను అమ్ముకున్నారని, కేపీహెచ్‌బీ కాలనీలో వేల కోట్ల హౌసింగ్ బోర్డు భూములను అమ్ముకున్నారని ఆరోపించారు. విదేశాల్లో ఉన్నవారు సైతం కాంగ్రెస్ ప్రభుత్వ పాలన చూసి ఇక్కడ పెట్టుబడులు పెట్టకుండా విదేశాల్లో షేర్ మార్కెట్లలో పెట్టుబడులు పెడుతున్నారని అన్నారు. వచ్చే నెల 7వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు ఉన్నాయని, 22ఏపై అసెంబ్లీని స్తంభింపజేస్తామని అన్నారు. గత ఏడాది పొంగులేటి ప్రతిపక్షంపై బాంబులు వేస్తామని చెప్పి, ఇప్పుడు ప్రజలపై 22ఏ పేరుతో బాంబు వేశారని అన్నారు. రేవంత్ రెడ్డి భూములు అమ్ముకోవడం తప్ప ఏం చేయడం లేదని, హెచ్‌సీయూ భూములు, పాలిటెక్నిక్‌ను ప్రైవేటుపరం చేసి కాలేజీల భూములను అమ్ముకునేందుకు కుట్ర చేస్తున్నాడని ఆరోపించారు. వెంటనే 22ఏ రద్దు చేయకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, సచివాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పండాల సతీష్ గౌడ్, తూము శ్రావణ్ కుమార్, రవీందర్ రెడ్డి, బాబు రావు, సబీహ బేగం తదితరులు పాల్గొన్నారు.

# ఓటు నిలుపుకోండి..

**హనుమకొండ,ఫ్లాష్ ఇండియా :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు సంబంధించి తుది దశ ప్రక్రియ హనుమకొండ జిల్లాలో వేగవం తమైంది. మ్యాపింగ్ కాని వారితో పాటు అనా మలిస్ (స్పష్టమైన గుర్తింపు లేని ఓటర్లు) జాబితాలో చేరిన ఓటర్లకు బీఎల్‌వోల ద్వారా నోటీసులు జారీ చేస్తున్నారు. జిల్లాలోని వరం గల్ పశ్చిమ, పరకాల అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలోని లక్షలాది ఓటర్ల వివరాలను పరిశీలించగా వేలాది మంది ఓటర్ల డేటాలో వ్యత్యాసాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. బీఎల్‌వోల ద్వారా నోటీసులు అందుకుంటున్న వారు ఈ నెల27 నుంచి నిర్ణీత గడువు లోగా తగిన ఆధారాలు చూపించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మ్యాపింగ్ కాని, ఆధారాలు సరిగ్గాలేని ఓటర్లకు ఇళ్ల వద్దకే వచ్చి బీఎల్‌వోలు నోటీసులు అందజేస్తున్నారు. 01-07-1987లోపు జన్మించిన వారు నోటీసులు అందుకుంటే 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒక గుర్తింపు కార్డు చూపిస్తే సరిపోతుంది. 1987 నుంచి 2004 మధ్యలో జన్మించిన వారు తప్పకుండా నోటీసు అందు కున్న వ్యక్తితో పాటు తల్లి లేదా తండ్రికి చెంది న గుర్తింపు కార్డు అందించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. సవరణలు, ఆధారాల స్వీకరణ ప్రక్రియ 19 సెప్టెంబరు 2026తో ముగుస్తుంది. క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత 19 అక్టోబరు 2026న తుది ఓటరు జాబితా విడుదల కానుంది.

### 12 రకాల గుర్తింపు కార్డులు ఇవే..

నోటీసులు పొందిన ఓటర్లు 12రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదానిని బీఎల్‌వోకి లేదా తహసీల్దార్ కార్యాలయంలో చూపించి తమ ఓటును సరిచేసుకోవాల్సి ఉంటుంది. 1. ఆధార్ కార్డు, 2. భారత పాస్‌పోర్ట్, 3. పాన్ కార్డ్, 4. డ్రైవింగ్ లైసెన్స్, 5. ప్రభుత్వ ఉద్యోగి గుర్తింపు కార్డు, 6. బ్యాంకు లేదా పోస్టాఫీస్ పాస్‌బుక్, 7. మహాత్మా గాంధీ ఉపాధి హామీ జాబ్ కార్డ్, 8. కార్మిక శాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ కార్డ్, 9. పింఛను బుక్, 10. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల గుర్తింపు కార్డ్, 11. రైతు పాస్‌బుక్ లేదా పట్టాదార్ పాస్‌బుక్, 12. ఎన్పీఆర్ స్మార్ట్ కార్డ్ లను అధికారులకు చూపించాల్సి ఉంటుంది.

### 132,070 మందికి నోటీసులు

జిల్లాలోని వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాల్లో మొత్తం 483 పోలింగ్ బూత్‌లు ఉండగా, 407,317 మంది ఓటర్లు ఉన్నట్లు ఈనెల 17తేదీన అధికారులు ఓటర్ల ముసా యిదాను విడుదల చేశారు. ఈ జాబితాలో 132,070 మందికి అధికారులు నోటీసులు అందించనున్నారు. మంగళవారం నాటికి 1821 మందికి బీఎల్‌వోలు నోటీసులు అందజేశారు. నోటీసులు అందుకున్నవారికి నిర్ణీత సమయం కేటాయిస్తారు. ఆ గడువులోపు ఆధారాలు చూపకుంటే ఓటుహక్కును కోల్పోతారు. ఆ తర్వాత ఆధారాలు తీసుకువచ్చిన అక్టోబరు 15 తర్వాత కొత్త దరఖాస్తులకు ఫారం-6, సవరణలు, పోలింగ్ కేంద్రం మార్పుకు ఫారం-8, అభ్యంతరాల కోసం ఫారం-7 ద్వారా సమర్పించాల్సి ఉంటుంది.

### సెప్టెంబరు 19 తేదీలోపు ఆధారాలు అందించాలి..

ఎస్ఐఆర్ ప్రక్రియను గడువులోగా పూర్తిచేయాలని ఇటీవల సమీక్షలో కలెక్టర్ ఆదేశించారు. నోటీసులు పొందిన ఓటర్లు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే తగిన ఆధారాలతో స్పందించాలి. లేకుంటే అక్టోబరు 19న ప్రచురించే తుది ఓటరు జాబితా నుంచి ఓటు హక్కు తొలగించబడే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

### అనామలిస్ అంటే ఏమిటీ?

ఎన్యూమరేషన్ ప్రక్రియలో సరిగా వివరాలు నమోదు కాకపోవడం ద్వారా అనామలిస్ సమస్య తలెత్తింది. ఇంటి పేరు, తండ్రి లేక భర్త పేర్లు తప్పుగా ఉండటం, లేదా వయస్సు నమోదులో వ్యత్యాసాలు ఉండటం చేత, పాతికేళ్ల కిందట వేసిన ఓటుకి, ప్రస్తుత ఓటుకి సంబంధించి సరైన లింక్ లేదా ఆధారాలు చూపకపోవడం, 2002లో ఎక్కడ ఓటు ఉందో చెప్పకపోవడం, తల్లిదండ్రుల వివరాలు ఇవ్వకుండా ఎన్యూమరేషన్ ఫారాన్ని అసంపూర్తిగా నింపి బీఎల్‌వోలకు అప్పగించిన వారిని ఈ అనామలిస్ విభాగంలో చేర్చారు.

# అసలెవరీ చిచ్చరపిడుగు?



**బిహార్ :** కొన్ని రోజులు బిహార్‌లో నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనలు ఉద్రిక్తతలకు దారి తీసింది. నిన్న బీహార్ రాజధాని పాట్నాలో నిరుద్యోగులు నిర్వహించిన ర్యాలీలో పోలీసులు లాఠీ ఛార్జ్, వాటర్ కెనాన్లు ప్రయోగించారు. వచ్చే నెలలో బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (బీపీఎస్సీ) నిర్వహించనున్న టీచర్స్ నియామక పరీక్షలను ప్రిలిమ్స్, మెయిన్స్ అని రెండు దశల్లో కాకుండా ఒకే దశలో నిర్వహించాలని అభ్యర్థులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తూ సీఎం నివాసం ముట్టడికి ప్రయత్నిస్తుండగా విద్యార్థులను పోలీసులు అడ్డుకునే క్రమంలో లాఠీచార్జి చేశారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. అయితే ఈ ఆందోళనలో ఓ ఆరేళ్ల బాలుడు సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా మారాడు. జాతీయ జెండాను చేతిలో పట్టుకుని ఆందోళనలో పాల్గొనడం అందరి దృష్టిలో పడేట్టు చేసింది. ఈ క్రమంలో ఆ బాలుడిని పోలీసులు తమ వెంట తీసుకువెళ్తుండగా మిగతా ఆందోళన కారులు ఆరేళ్ల బాలుడిని అరెస్టు చేస్తారా అంటూ పోలీసులపై మండిడ్డారు. దీంతో ఈ బాలుడు ఇప్పుడు దేశవ్యాప్తంగా వైరల్ గా మారాడు. ఈ క్రమంలో ఆ బాలుడి వివరాలు ఏంటనే ఆసక్తి సర్వత్రా నెలకొంది.

### మొదటి తూటా నాపైనే ప్రయోగించండి:

నిరుద్యోగుల ఆందోళనలో అందరి దృష్టిని ఆకర్షించిన బాలుడి పేరు ఆదిత్య కుమార్‌గా తెలిసింది. 1వ తరగతి చదువుతున్న ఆదిత్య తన తల్లిదండ్రులతో కలిసి నిరసనల్లో పాల్గొన్నాడు. ఈ క్రమంలో ఆందోళనకారులను బస్సుల్లో పోలీసులు తరలిస్తుండగా బస్సుపైకి ఎక్కిన ఆదిత్య చేతిలో త్రివర్ణ పతాకం పట్టుకుని నినాదాలు చేశాడు. అయితే అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా ఉండటంతో ఆదిత్యతోపాటు అతడి తల్లిని పోలీసులు వాహనంలో అక్కడి నుంచి తీసుకెళ్లారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆదిత్య స్కూల్‌కు వెళ్లాల్సిన వయసులో ఆందోళనలు నీకెందుకని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు వచ్చానన్నాడు. ఇప్పుడు పేపర్ లీకులు అవుతున్నాయి, నేను పెద్దయ్యాక కూడా ఇలాంటివి జరగకూడదని నేను కూడా నిరసనకు దిగానంటూ బదులిచ్చాడు. విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని నినాదాలు డిమాండ్ చేశారు. బుల్లెట్ గాయాలకు కూడా తాను సిద్ధమేనని అవసరమైతే మొదటి తూటా నాపైనే ప్రయోగించాలంటూ ధైర్యంగా మాట్లాడాడు. లాఠీ చార్జీలకు, జైళ్లకు, బుల్లెట్లకు భయపడి వెనక్కి తగ్గేది లేదన్నాడు. విద్యార్థులపై దాడులకు ఎవరు అనుమతి ఇచ్చారో సమాధానం చెప్పాలని ఎస్పీని డిమాండ్ చేశాడు.

### ఇదే తొలి ఆందోళన కాదు:

అయితే ఆదిత్యకు ఇదే తొలి నిరసన కాదని స్థానికులు చెబుతున్నారు. గతంలో విద్యార్థుల నిరాహార దీక్షల వద్దకు, ఇతర రాజకీయ నిరసనల్లోనూ కనిపించినట్లు కథనాలు చెబుతున్నారు. ఆరేళ్ల బాలుడు ధైర్యంగా మీడియా ముఖంగా మాట్లాడుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారడంతో జెన్ అల్ఫా సైతం ఆందోళనల్లో పాల్గొంటోందని కామెంట్స్ చేస్తున్నారు. అయితే ఆరేళ్ల బాలుడిని అరెస్టు చేశారంటూ వీడియోలు వైరల్ అవుతున్నా దీనిపై అధికారులు ఇంకా ఎలాంటి ప్రకటన చేయలేదు.

# హైకోర్టు తీర్పుపై ఒవైసీ ఆగ్రహం

## హిజాబ్‌పై నిర్ణయించడానికి జడ్జీలు ఎవరు?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** పాఠశాలలో హిజాబ్ ధరించేందుకు అనుమతి నిరాకరిస్తూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర స్థాయిలో ఖండించారు. ఈ తీర్పును ఇస్లాంపై దాడిగా అభివర్ణించారు. ఇది మా మతం, ఏది అవసరమో మేమే నిర్ణయించుకుంటాం. నిర్ణయించడానికి న్యాయమూర్తులు ఎవరు? అని ప్రశ్నించారు. ఇస్లాంకు ఏది ముఖ్యమో, ఏది ముఖ్యం కాదో నిర్ణయించడం న్యాయమూర్తుల పని కాదన్నారు. స్కూల్ యూనిఫామ్‌కు అదనంగా హిజాబ్ ధరించేందుకు తనకు అనుమతి ఇచ్చేలా విద్యాసంస్థను ఆదేశించాలని కోరుతూ ప్రయాగ్‌రాజ్‌లోని ఒక ప్రైవేట్ స్కూల్ లో చదువుతున్న ఓ విద్యార్థిని దాఖలు చేసిన పిటిషన్‌ను ఈ నెల 21న జస్టిస్ జేజే మునీర్, జస్టిస్ ఇంద్రజీత్ శుక్లాతో కూడిన ధర్మాసనం కొట్టివేసింది. అలాగే ఇస్లాంలో మహిళలు హిజాబ్



ధరించడం తప్పనిసరైన మత ఆచారం కాదని హైకోర్టు స్పష్టం చేసింది.

### రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన:

హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఒవైసీ.. అలహాబాద్ హైకోర్టు తీర్పుపై స్పందించారు. ఈ తీర్పు రాజ్యాంగంలోని ఆర్టికల్ 19, ఆర్టికల్ 25కు వ్యతిరేకమని ఆరోపించారు. శబరిమల కేసుకు సంబంధించి అత్యవసర మతాచారాలపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న వేళ అలహాబాద్ హైకోర్టు ఈ తీర్పు ఇవ్వడం సరికాదన్నారు. ఈ తీర్పు వల్ల ఉత్తరప్రదేశ్‌లో ముస్లిం బాలికల విద్య దెబ్బతింటుందని వారిని చదువుకు దూరం చేసే కుట్ర అని ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు.

### మోడీ వారికంటే గొప్ప దేశభక్తుడా?

వందేమాతరం వివాదంపై స్పందిస్తూ మోడీ తుర్రేబాజ్ ఖాన్, రవీంద్రనాథ్ ఠాగూర్, నేతాజీ సుభాష్ చంద్రబోస్, మహాత్మా గాంధీ వంటి స్వాతంత్ర్య సమరయోధుల కంటే గొప్ప దేశభక్తుడా అని ప్రశ్నించాడు. భారతదేశ ప్రగతి కోసం పనిచేస్తూనే ముస్లింలు తమ విశ్వాసంలో స్థిరంగా ఉంటారని ఒవైసీ అన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీపై మండిపడుతూ.. దేశభక్తి కోసం మత విశ్వాసాలను రాజీ పడాల్సిన అవసరం లేదన్నారు. ఈ దేశం అందరిదన్నారు. రాజ్యాంగ పీఠిక భారత మాత అంటూ మొదలు కాదు.. భారతదేశ ప్రజలమైన వేము అంటూ మొదలవుతుందన్నారు.

# ఉచిత కంప్యూటర్ శిక్షణ

**కొల్లాపూర్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణ లోని రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా నిరంతరంగా నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా సెప్టెంబర్ 01/26 నుంచి నూతన బ్యాచ్ ప్రారంభమగును. ఆగస్టు 31వ తేదీ వరకు ఫౌండేషన్ కార్యాలయం లో పేర్లు నమోదు చేసుకొని విద్యార్థిని.విద్యార్థులు.యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని విజ్ఞప్తి.

**కోర్సులు:** ఎంఎస్ ఆఫీస్ . డీటీపీ
**అర్హత:** ఇంటర్ (పాస్/ఫెయిల్)
**స్థలం:** రత్నగిరి ఫౌండేషన్ కార్యాలయం (మంత్రి జూపల్లి క్యాంప్ ఆఫీస్ రామాపురం రోడ్)

**వివరాలకు:**
ఫోన్ :
8309672607,6300141297,
9989761951,

కేతూరి ధర్మతేజ
కన్వీనర్ రత్నగిరి ఫౌండేషన్ కొల్లాపూర్

# శ్రీకాంతచారీ విగ్రహం దగ్గర మినీ బస్సు స్టాప్ ఏర్పాటు చేయాలి



**కోడేరు,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నాగర్ కర్నూల్ జిల్లా కోడేరు మండల కేంద్రంలో బీసీ కాలనీలో శ్రీకాంత చారీ విగ్రహం దగ్గర మినీ బస్సు స్టాప్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు, నిత్యం వనపర్తి, నాగర్ కర్నూల్ హైదరాబాద్ కొల్లాపూర్ కు వెళ్లి ప్రయాణికులు పేరు కు మాత్రం శ్రీకాంత చారీ బస్సు స్టాప్ కానీ కూర్చువాడనికి సీట్లు ఉండవు నిలబడి ఉందాం అంటే నీడ ఉండడదు,వర్షం వస్తే తడవలి ఎండ లో నీలబడి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది కావున ఎస్సీ కాలనీ లో ఏర్పాటు చేసిన మినీ బస్సు స్టాండ్ బీసీ కాలనీలో కూడ ఏర్పాటు చేయాలని, కోడేరు గ్రామ సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి ని ప్రయాణికులు గ్రామ-స్తులు, ఎండకు నిలబడలేక ఇటు వానకు తడుస్తూ ఉండలేక పోతున్నాం అని కోడేరు గ్రామ సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి దయచేసి బీసీ కాలనీ లో శ్రీకాంతా చారీ విగ్రహం దగ్గర మినీ బస్సు స్టాప్ ఏర్పాటు చేయాలి అని మరి మరి కోరుతున్నారు

# ముదిరాజ్ జర్నలిస్ట్ సంఘం జిల్లా కన్వీనర్ బంటు సైదులు కు ఘన సన్మానం



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** తెలంగాణ ముదిరాజ్ జర్నలిస్ట్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నీలకంఠం ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి బోయిని శ్రీనివాస్ ల చేతుల మీదుగా బంటు సైదులను నల్లగొండ జిల్లా కన్వీనర్‌గా నియమించడం జరిగింది. ఈ నియామకాన్ని పురస్కరించుకుని బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని ముదిరాజ్,బీసీ సంఘం నేతలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జర్నలిస్టు బంటు సైదులు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ పదవి బాధ్యతలు అప్పజెప్పిన రాష్ట్ర అధ్యక్షులు నీలకంఠం ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి బోయిని శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. నల్లగొండ మరియు సూర్యపేట జిల్లాల్లో ముదిరాజ్ జర్నలిస్టులను ఏకం చేసి, రెండు జిల్లాలకు అధ్యక్షులు మరియు కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి సంఘాన్ని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ముదిరాజ్ సంఘం యువజన అధ్యక్షుడు, మిర్యాలగూడ బిజెపి పార్టీ వన్ టౌన్ అధ్యక్షుడు బంటు గిరి,బిజెపి వన్ టౌన్ ప్రధాన కార్యదర్శి పద్మశాలి సంఘం కార్యవర్గ సభ్యుడు కొంగరి వెంకటరమణ,బిజెపి వన్ టౌన్ ప్రధాన కార్యదర్శి మూలరాజిరెడ్డి (రెడ్డి సంఘం కార్యవర్గ సభ్యుడు),బిజెపి వన్ టౌన్ ఓబీసీ పట్టణ అధ్యక్షుడు బొట్టు సోములు ముదిరాజ్, సీనియర్ జర్నలిస్టు నక్క శ్రీను,బీసీ సంఘం మిర్యాలగూడ పట్టణ బీసీ జేఏసీ కన్వీనర్ బంటు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు మీలాద్-ఉన్-నబీ పర్వదిన శుభాకాంక్షలు



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ పట్టణంలోని ఇస్లాంపురం 47వ వార్డులో ముస్లిం సోదరులు నిర్వహించిన పవిత్ర మీలాద్-ఉన్-నబీ పర్వదిన కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ ముస్లిం సోదరులకు మీలాద్-ఉన్-నబీ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రవక్త మహమ్మద్ బోధనలు మానవాళికి శాంతి, సోదరభావం, ప్రేమ, కరుణ, ఐక్యత వంటి గొప్ప విలువలను అందించాయని పేర్కొన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గంలో అన్ని మతాలు,వర్గాల ప్రజలు సోదరభావంతో, పరస్పర గౌరవంతో కలిసి మెలిసి జీవించేలా కృషి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నానని ఎమ్మెల్యే బిఎల్ఆర్ తెలిపారు. ప్రజలందరి సంక్షేమం,శాంతి, సౌభ్రాతృత్వమే తన ప్రధాన లక్ష్యమని అన్నారు. అనంతరం నిర్వహించిన మిఠాయి పంపిణీ కార్యక్రమంలో పాల్గొని,ముస్లిం సోదరులతో కలిసి పర్వదిన వేడుకల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు,ముస్లిం మత పెద్దలు,యువకులు, మహిళలు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...



# నూతన ఎల్ఈడి వీధిలైట్లతో వెలిగిపోయిన మొల్కచర్ల గ్రామం

**అడవిదేవులపల్లి, ఫ్లాష్ఇండియా ప్రతినిధి :** అడవిదేవులపల్లి మండలంలోని మొల్కచర్ల గ్రామంలో నూతన ఎల్ఈడీ వీధి దీపాలను ఏర్పాటు చేశారు.సర్పంచ్ పాతులోతు మాంగిని ఆధ్వర్యంలో గ్రామంలోని విద్యుత్ స్తంభాలన్నింటికీ ఎల్ఈడీ దీపాలను అమర్చారు.దీంతో రాత్రివేళ గ్రామమంతా విద్యుత్ వెలుగులతో కళకళలాడుతోంది.కొత్త వీధి దీపాలతో ప్రధాన రహదారులు,వీధులు ప్రకాశవంతంగా మారడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

# చిన్నపత్రికలు సమాజానికి దారి చూపే దీపాలు'అనే అంశం పై ఇష్టాగోష్టి




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సమాచార భారతి ఆద్వర్యం లో ఈ నెల 30 న లి'చిన్న పత్రికలుసమాజానికి దారి చూపే దీపాలు' అనే అంశం పై పబ్లిషర్లు, సంపాదకుల ఇష్టాగోష్టి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సమాచార భారతి సంస్థ ఇడుదల చేసిన ప్రకటలో పేర్కొంది. ఆబిడ్స్ లోని స్టాన్లీ ఇంజినీరింగ్ కళాశాల జరిగే ఈ కార్యక్రమానికి ప్రధాన వక్త గా RSS క్షేత్ర ప్రచారక్ప భరత్ కుమార్ పాల్గొంటున్నట్లు తెలిపింది.

# టీపీసీసీ సోషల్ మీడియా ఛైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన శ్రీ నవీన్ పెట్టెం



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మరియు ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ సమక్షంలో.. టీపీసీసీ సోషల్ మీడియా నూతన ఛైర్మన్ గా నవీన్ పెట్టెం మంగళవారం గాంధీ భవన్ లో అధికారికంగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఛైర్మన్‌తో పాటు నూతనంగా నియమితులైన సోషల్ మీడియా కన్వీనర్లు, కోఆర్డినేటర్లు కూడా తమ తమ బాధ్యతలను స్వీకరించారు.
ఈ కార్యక్రమంలో భువనగిరి ఎంపీ, టీపీసీసీ మీడియా ఛైర్మన్ చామల కిరణ్ కుమార్ రెడ్డి , జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ , రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ , యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి , వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు మరియు పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం నవీన్ పెట్టెం మాట్లాడుతూ.. "ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడం, క్షేత్రస్థాయి మరియు గ్రామస్థాయి సమస్యలను పీసీసీ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం, అలాగే 2029లో కాంగ్రెస్ పార్టీని 100 స్థానాలలో గెలిపించి, మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి అహర్నిశలు శ్రమించడమే మా లక్ష్యం" అని పేర్కొన్నారు.

# మహిళా సంఘాలే మాదకద్రవ్య రహిత సమాజానికి 'సంఘమిత్రలు'





**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మాదకద్రవ్యాల నిర్మూలనలో మహిళా సంఘాలు కీలక పాత్ర పోషించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత పిలుపునిచ్చారు. ప్రతి మహిళ తన కుటుంబంతో పాటు గ్రామాలు, పట్టణాలను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడే "సంఘమిత్ర"గా వ్యవహరించాలని సూచించారు.జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "సంఘమిత్ర--మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన సదస్సు" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, డీసీపీ రాజమహేంద్ర నాయక్‌తో కలిసి కమిషనర్ శ్వేత పాల్గొన్నారు.ఈ సందర్భంగా శ్వేత మాట్లాడుతూ.. యువతే రాష్ట్ర భవిష్యత్తని, వారిని డ్రగ్స్‌కు దూరంగా ఉంచడం ప్రతి కుటుంబం, మహిళా సంఘం బాధ్యత అన్నారు. గంజాయి వంటి మాదకద్రవ్యాలు మెదడు, నరాల వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. డ్రగ్స్‌కు బానిసైన వారిని నేరస్తులుగా కాకుండా చికిత్స, పునరావాసం ద్వారా సాధారణ జీవితంలోకి తీసుకురావాలని సూచించారు.గ్రామాల్లో గంజాయి విక్రయాలు, రవాణా లేదా వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే 112కు తెలియజేయాలని కోరారు. సమాచారాన్ని గోప్యంగా ఉంచడంతో పాటు అవసరమైతే బహుమతులు అందిస్తామని తెలిపారు. మహిళా సంఘాల సమావేశాల్లో డ్రగ్స్, సైబర్ నేరాలు, మహిళల భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు.కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ.. జిల్లాలోని సుమారు 1.25 లక్షల మంది మహిళా సంఘాల సభ్యుల ద్వారా ప్రతి ఇంటికి డ్రగ్స్ వ్యతిరేక సందేశాన్ని తీసుకెళ్లవచ్చన్నారు. డ్రగ్స్ వల్ల ఆరోగ్యంతో పాటు కుటుంబ, ఆర్థిక, సామాజిక సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు.డీసీపీ రాజమహేంద్ర నాయక్ మాట్లాడుతూ.. పిల్లల ప్రవర్తనలో ఆకస్మిక మార్పులు, కొత్త స్నేహాలు, ఆలస్యంగా ఇంటికి రావడం వంటి లక్షణాలను తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. సమస్యను దాచకుండా పోలీసులకు లేదా డీ-అడిక్షన్ కేంద్రాలకు సమాచారం ఇవ్వాలని కోరారు.సదస్సులో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, చికిత్స, పునరావాసంపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా డ్రగ్స్ వ్యతిరేక సందేశాన్ని అందించారు. అనంతరం డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేశారు.

# ఆదాయం ఫుల్... సౌకర్యాలు నిల్

**మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో అపరిశుభ్రత**
**ప్రయాణికులకు కలుషిత నీటి ముప్పు**
**సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరిక**



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ లో ప్రయాణికుల కోసం ఏర్పాటుచేసిన తాగునీటి వాటర్ ట్యాంకు పూర్తిగా అపరిశుభ్రంగా ఉంది.వాటర్ ట్యాంక్ పై భాగం ఖాళీగా ఉండటంతో అందులో క్రిమికీటకాలు,పురుగులు ఏవేవి పడుతున్నాయో అనే పర్యవేక్షణ లేదు. ఆ వాటర్ ట్యాంక్ నుంచే పైపుల ద్వారా ఫ్రిడ్జ్ లోకి త్రాగునీరు చేరుతుంది.అట్టి నీరును ప్రయాణికులు తాగుతున్నారు. మిర్యాలగూడ పట్టణ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం పూర్తి స్థాయిలో అపరిశుభ్రంగా అధ్వాన స్థితిలో ఉంటుంది. మరుగుదొడ్లు కూడ క్లీన్ చేసే పరిస్థితి లేదు. మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్ పై ఉన్నతాధికారుల సరైన పర్యవేక్షణ లేకపోవడంతో ఇక్కడి అధికారులకు ఇష్టారాజ్యంగా మారింది. ఇప్పటికైనా ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం ఆడకుండా పరిశుభ్రమైన తాగునీరు అందించాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏ ఐ ఫ్ డి ఎస్ )తరపున డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎఐ ఎఫ్డిఎస్ నాయకులు ఆర్టీసీ బస్టాండ్ ను బుధవారం పరిశీలించి విస్తు పోయారు. ఈ సందర్భంగా ఏ ఎఫ్ డి ఎస్ జిల్లా అధ్యక్షులు పోతుగంటి కాశీ మాట్లాడుతూ ప్రయాణికులు ఆరోగ్య పరిరక్షణ కోసం ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

# హైదరాబాద్ విమోచన చరిత్రను ప్రతి ఇంటికీ చేరుస్తాం



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ప్రాంతం దశాబ్దాలుగా వివక్షకు, అణచివేతకు గురైందని, దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వస్తే నిజాం నిరంకుశ పాలన, రజాకార్ల రక్తచరిత్ర నుంచి తెలంగాణకు 1948 సెప్టెంబర్ 17నే విమోచనం లభించిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, తెలంగాణ విమోచన కమిటీ చైర్మన్ డా. బూర నర్సయ్య గౌడ్ స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజాం పాలన కింద ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల్లో సెప్టెంబర్ 17ను ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహిస్తుంటే, పోరాటానికి కేంద్రబిందువైన తెలంగాణలో మాత్రం అమరవీరులకు అధికారిక గుర్తింపు ఇవ్వకపోవడం చారిత్రక అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో 1969 తొలిదశ ఉద్యమంలో 369 మంది, మలిదశలో దాదాపు 1,200 మంది బలిదానాలు చేశారని, రాష్ట్రం ఏర్పడి 13 ఏళ్లు గడుస్తున్నా అమరవీరుల స్థూపానికి తాళాలు వేసి ఉండటం, సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు.సుందర్‌లాల్ కమిటీ నివేదిక ప్రకారం విమోచన పోరాటంలో సుమారు 20 వేల మంది ప్రాణాలు కోల్పోయారని, నిజాం పాలన ముగిసినా గడీల రాజకీయ సంస్కృతి కొనసాగుతోందని బూర నర్సయ్య గౌడ్ విమర్శించారు. తెలంగాణ విమోచన పోరాటం ఏ ఒక్క మతానికో సంబంధించింది కాదని, నిజాం అకృత్యాలకు వ్యతిరేకంగా కలం పట్టిన ముస్లిం జర్నలిస్ట్ షోయబుల్లా ఖాన్‌ను రజాకార్లు పొట్టనబెట్టుకున్న ఉదంతమే ఇందుకు నిదర్శనమని గుర్తుచేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఓటు బ్యాంకు, అప్పీజ్మెంట్ రాజకీయాల కోసం ఎంఐఎంకు తలొగ్గి చారిత్రక వాస్తవాలను వక్రీకరిస్తున్నాయని, మరోవైపు కమ్యూనిస్టు పార్టీలు కూడా తమ అస్తిత్వాన్ని తాకట్టు పెట్టాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అధికారికంగా విమోచన ఉత్సవాలు నిర్వహిస్తోందని, అదే స్ఫూర్తితో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సూచనల మేరకు విమోచన చరిత్రను ప్రతి గడపకూ చేర్చేందుకు 'తెలంగాణ విమోచన ఉత్సవ కమిటీ' ఆధ్వర్యంలో సమగ్ర కార్యాచరణను రూపొందించినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా తెలంగాణ విమోచన సాధన కోసం బీజేపీ తరపున 7 ప్రధాన డిమాండ్లను ఆయన రాష్ట్ర ప్రభుత్వం ముందుంచారు సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలి. విమోచన ప్రదాత సర్దార్ వల్లభభాయ్ పటేల్ భారీ స్మారక చిహ్నం 'స్టాచ్యూ ఆఫ్ లిబరేషన్ -- తెలంగాణ'ను హైదరాబాద్‌లో నెలకొల్పాలి. అంతర్జాతీయ ప్రమాణాలతో 'తెలంగాణ విమోచన మ్యూజియం' ఏర్పాటు చేయాలి. ప్రతి జిల్లా కేంద్రంలో 'తెలంగాణ విమోచన స్మృతి కేంద్రం' నిర్మించాలి. తెలంగాణ విమోచన చరిత్రను అధికారిక పాఠ్యపుస్తకాలలో చేర్చాలి. అమరవీరులు, ఉద్యమకారుల సమగ్ర జాబితాను రూపొందించి వారికి, వారి కుటుంబాలకు తగిన గుర్తింపు, గౌరవం ఇవ్వాలి. వీరభైరాన్‌పల్లి, పరకాల (డెక్కన్ జలియన్‌వాలాబాగ్), కడవెండి, జోడేఘాట్, నిర్మల్, నల్గొండ వంటి చారిత్రక ప్రాంతాలను కలుపుతూ 'తెలంగాణ విమోచన పర్యాటక సర్క్యూట్'ను అభివృద్ధి చేయాలి. అదేవిధంగా, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, ప్రజాస్వామ్య పునరుద్ధరణ కోసం బీజేపీ 5 కీలక ప్రతిజ్ఞలను ప్రకటించిందని తెలిపారు రజాకార్ రాజకీయ వారసత్వ కలయిక అయిన ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ కూటమికి చరమగీతం పాడటం.శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్రమంతటా పన్నులు, చట్టాల అమలులో సమానత్వం ఉండేలా "ఒకే రాష్ట్రం -- ఒకే రూల్" విధానాన్ని తీసుకురావడం.అదేవిధంగా ఈ ఆగస్టు 27న వీరభైరాన్‌పల్లిలో, సెప్టెంబర్ 2న పరకాల అమరధామంలో అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, సెప్టెంబర్ 17 వరకు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత కార్యక్రమాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 17న కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ ల ఆధ్వర్యంలో పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇది నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆత్మగౌరవ పోరాటమని, పార్టీలు, మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఈ చరిత్ర పునరుజ్జీవన యజ్ఞంలో భాగస్వామ్యం కావాలని డా. బూర నర్సయ్య గౌడ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర విమోచన ఉత్సవ కమిటీ కన్వీనర్ నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, విమోచన కమిటీ సభ్యులు శ్రీ కప్పర ప్రసాద్ రావు, సందీప్ సాయి, అధికార ప్రతినిధి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 'సూరీడు' కమ్‌బ్యాక్ అవుతాడా?



భారత టీ20 మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అంతర్జాతీయ జట్టులోకి తిరిగి రావడంపై మరోసారి చర్చ మొదలైంది. కొలంబోలో జరిగిన ఓ కార్యక్రమంలో శ్రీలంక దిగ్గజం సనత్ జయసూర్యను కలిసిన సూర్య.. సరదాగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. జయసూర్య ఫిట్‌గా కనిపించడాన్ని గమనించిన సూర్యకుమార్.. 'ఫిట్‌గా అవుతున్నారు.. మళ్లీ కమ్‌బ్యాక్‌కు ప్రయత్నిస్తున్నారా?' అంటూ సరదాగా ప్రశ్నించాడు. దీనికి జయసూర్య చిరునవ్వుతో స్పందించాడు. ఈ వీడియో అభిమానులను బాగా ఆకట్టుకుంది. అయితే ఈ సరదా సంభాషణకు మించి.. మరో న్యూస్ కూడా ఉంది. సూర్యకుమార్ యాదవ్ టీమిండియాలోకి తిరిగి వచ్చే అవకాశాలపై బీసీసీఐ వర్గాల నుంచి కూడా కీలక సమాచారం వెలువడింది. సూర్యకు టీమిండియా తలుపులు పూర్తిగా మూసుకుపోలేదని, దేశవాళీ క్రికెట్‌లో వరుసగా పరుగులు సాధిస్తే అతడిని మళ్లీ ఎంపిక చేసే అవకాశం ఉందని ఓ బీసీసీఐ అధికారి తెలిపారు. 2026 టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టుకు సూర్యకుమార్ నాయకత్వం వహించి టైటిల్ అందించాడు. అయితే ఆ తర్వాత అతడి బ్యాటింగ్ ఆశించిన స్థాయిలో లేకపోవడంతో.. టీ20 కెప్టెన్సీ నుంచి తప్పించారు. అంతేకాదు ఆటగాడిగా చోటు కోల్పోయాడు. ఇటీవల ముగిసిన ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు కూడా సూరీడుని బీసీసీఐ సెలెక్టర్లు ఎంపిక చేయలేదు. అతడి స్థానంలో శ్రేయాస్ అయ్యర్‌కు టీ20 కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించారు. శ్రేయాస్ నాయకత్వంలో భారత టీ20 జట్టుకు ఆశించిన ఆరంభం దక్కలేదు. ఐర్లాండ్‌పై భారత్ 2-0తో సిరీస్ కోల్పోగా.. ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో 4-0తో ఓటమి ఎదురైంది. జింబాంబ్వేపై సిరీస్ గెలవడం ఊరట కలిగింది. ఈ నేపథ్యంలో సూర్యకుమార్ తిరిగి జట్టులోకి వస్తాడా? అనే చర్చ మరింత ఆసక్తికరంగా మారింది. సూర్యకుమార్ తన కమ్‌బ్యాక్ కోసం తీవ్రంగా శ్రమిస్తున్నాడు. జూలైలో తన సోషల్ మీడియా ద్వారా ఒక రోజు మూడు గంటల పాటు సుమారు వెయ్యి బంతులు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసినట్లు వెల్లడించాడు. ప్రస్తుతం సూరీడు జాతీయ జట్టు ప్రణాళికల్లో భాగంగా లేకపోయినా.. దేశవాళీ క్రికెట్‌లో నిరంతరం రాణిస్తే తిరిగి జాతీయ జట్టులో చోటు దక్కే అవకాశాలు ఉన్నాయని బీసీసీఐ వర్గాలు స్పష్టం చేశాయి. దీంతో రాబోయే దేశవాళీ సీజన్ సూర్యకుమార్ కెరీర్‌కు కీలకంగా మారనుంది. ఒక్కసారి తన ఫామ్‌ను తిరిగి అందుకుంటే టీమిండియాలో కమ్‌బ్యాక్ చేస్తాడు.





# హార్దిక్ పాండ్యా ట్రేడ్ ఖరారు..

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఐపీఎల్ ట్రేడ్ విషయంలో మరో వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ముంబై ఇండియన్స్ నుంచి కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) జట్టులోకి హార్దిక్ మారడం దాదాపు ఖరారైందని ఆ వార్త సారాంశం. ఈ డీల్‌కు సంబంధించిన చర్చలు తుది దశకు చేరుకున్నాయట. అక్టోబర్ 11న కేకేఆర్ హార్దిక్ ట్రేడ్‌పై అధికారిక ప్రకటన చేయనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ట్రేడ్‌పై ఇప్పటివరకు అటు ముంబై, ఇటు కోల్‌కతా ఫ్రాంఛైజీలు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

**కోల్‌కతా భారీ ఆఫర్:**

హార్దిక్ పాండ్యాను తమ జట్టులోకి తీసుకునేందుకు ముంబై ఇండియన్స్‌కు కోల్‌కతా నైట్ రైడర్స్ ఓ భారీ ఆఫర్ చేసిందట. స్టార్ ప్లేయర్స్ రామ్‌దీప్ సింగ్, హర్షిత్ రాణాలను ఇచ్చేందుకు కేకేఆర్ సిద్ధంగా ఉందని తెలుస్తోంది. ఈ ఇద్దరు ఆటగాళ్లు ముంబైకి వెళితే.. హార్దిక్ కేకేఆర్‌లోకి వస్తాడు. ఇప్పటికే ముంబై, కోల్‌కతా మధ్య ఈ ట్రేడ్ డీల్ పూర్తయిందని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. చూడాలి మరి ఈ ట్రేడ్ వార్తలు అయినా నిజమవుతాయా లేదో.

**చెన్నై, గుజరాత్ నుంచి ఆఫర్లు:**

మరోవైపు హార్దిక్ పాండ్యాకు చెన్నై సూపర్ కింగ్స్, గుజరాత్ టైటాన్స్ నుంచి కూడా ట్రేడ్ ఆఫర్లు వచ్చినట్లు సమాచారం. అయితే ఆయా ఫ్రాంచైజీల నుంచి తనకు కెప్టెన్సీ బాధ్యతలు కావాలని హార్దిక్ కోరినట్లు, ఆ డిమాండ్‌కు వారు అంగీకరించలేదని ప్రచారం జరుగుతోంది. దీంతో చివరకు కేకేఆర్ వైపు హార్దిక్ మొగ్గుచూపినట్లు కథనాలు వెలువడుతున్నాయి. హార్దిక్ భవిష్యత్తుపై ఇప్పటికే ఊహాగానాలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ తాజా ట్రేడ్ వార్తలు ఐపీఎల్ వర్గాల్లో మరింత ఆసక్తిని పెంచాయి. అయితే ట్రేడ్ డీల్ నిజమా అని తెలియాలంటే.. అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

**నాయకుడు అవసరం:**

హార్దిక్ పాండ్యా నిజంగానే కేకేఆర్‌లో చేరితే జట్టు కాంబినేషన్‌లో భారీ మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. హార్దిక్ ఆల్‌రౌండర్ కాబట్టి.. బ్యాటింగ్, బౌలింగ్‌తో పాటు నాయకత్వ అనుభవం కేకేఆర్‌కు ఉపయోగపడే అవకాశం ఉంది. గత రెండు సీజన్లుగా కేకేఆర్ నిరాశపరుస్తోంది. అజింక్య రహానే సారథ్యంలో చెత్త ప్రదర్శన చేసింది. జింక్స్ ఆటకు వీడ్కోలు పలికిన నేపథంలో.. కోల్‌కతా ఇప్పుడు నాయకుడు అవసరం. ఈ నేపథ్యంలోనే హార్దిక్ కోసం గట్టిగానే ట్రై చేస్తుందట.

# మేము బాగా బౌలింగ్ చేస్తే సరిపోదు..

శ్రీలంకతో కొలంబోలో జరుగుతున్న రెండో టెస్టులో టీమిండియా ఆధిపత్యం కొనసాగుతోంది. భారత్ 503/9 వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేయగా.. మూడో రోజులో రెండో సెషన్లో శ్రీలంక 181/7 స్కోరుతో నిలిచింది. లంక ఇంకా 322 పరుగులు వెనుకబడి ఉంది. టీమిండియా పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ మూడు కీలక వికెట్స్ పడగొట్టి.. లంకను ఒత్తిడిలో పడేశాడు. ఈరోజు మీడియాతో ప్రసిద్ధ్ మాట్లాడుతూ తన ప్రణాళికలను వెల్లడించాడు. ఈ క్రమంలో పిచ్, స్లిప్ క్యాచింగ్, తన బౌలింగ్ విధానం గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించాడు. బౌలర్లు బాగా బౌలింగ్ చేస్తే సరిపోదని, స్లిప్ ఫీల్డర్లు క్యాచ్ అందుకోవడం మరింత ముఖ్యం అని పేర్కొన్నాడు. 'శ్రీలంక ఓపెనర్ లాహిరు ఉదారాను ఔట్ చేసిన సమయంలో బంతి పిచ్‌పై కొద్దిగా ఆగి, స్వల్పంగా సీమ్ అయింది. బంతి బ్యాట్ ఎడ్జ్ తీసుకుంది. యశస్వి జైస్వాల్ అద్భుతమైన క్యాచ్ అందుకున్నాడు. ప్రాక్టీస్‌లో ఫీల్డింగ్‌పై టీమ్ ఎంతో శ్రమిస్తోంది. అందుకు తగిన ఫలితం ఈ క్యాచ్ రూపంలో వచ్చింది. బౌలర్ ఎడ్జ్ అయ్యేలా బంతిని సరైన ప్రదేశంలో వేయడం ఎంత ముఖ్యమో.. వచ్చిన అవకాశాన్ని స్లిప్ ఫీల్డర్లు క్యాచ్ అందుకోవడం కూడా అంతే ముఖ్యం. జట్టు ఈ విషయంలో బాగా శ్రమిస్తోంది. మ్యాచ్‌లో పెద్ద విషయాల కంటే చిన్న చిన్న అంశాలను సరిగ్గా చేయడమే విజయానికి దోహదపడుతుంది' అని ప్రసిద్ధ్ చెప్పుకొచ్చాడు. 'నా బౌలింగ్‌లో దూకుడుకు ప్రాధాన్యం ఇస్తా. అయితే బౌలర్ దూకుడు అనేది మాటలు లేదా శరీర భాషలోనే కనిపించాల్సిన అవసరం లేదు. నేను బంతులు వేసే విధానంలో అది కనిపిస్తుంది. పిచ్‌పై ఏమాత్రం స్పందన లేకపోయినా బౌలర్ దృష్టి మాత్రం మారకూడదు. ఎక్కడ బంతి వేయాలనుకుంటున్నాడనే దానిపైనే దృష్టి ఉండాలి. పూర్తి శ్రమతో అనుకున్న ప్రాంతాల్లో బౌలింగ్ చేయడమే నా లక్ష్యం. నేను ఒకే లెంగ్త్‌లో బౌలింగ్ చేసే బౌలర్ ని కాదు. పిచ్ స్వభావాన్ని బట్టి బౌలింగ్ లెంగ్త్‌ను మార్చుకుంటా. ఇందుకోసం విశ్లేషకులు, కోచ్‌లతో కలిసి చర్చించి.. ఏ లెంగ్త్‌లో బౌలింగ్ చేయాలనే దానిపై నిర్ణయం తీసుకుంటా' అని ప్రసిద్ధ్ వెల్లడించాడు. దేశానికి ఆడక ముందు తనకంటూ ఒక సహజ లెంగ్త్ ఉండేదని.. కానీ అంతర్జాతీయ స్థాయిలో టీమ్‌కు అవసరమైన ఏ లెంగ్త్‌లోనైనా బౌలింగ్ చేయడం నేర్చుకోవాల్సి ఉంటుందని ప్రసిద్ధ్ పేర్కొన్నాడు.




# బిజినెస్

## స్వల్పంగా తగ్గిన పసిడి




రోజు రోజుకి పైపైకి ఎగబాకుతూ సామాన్యుడికే కాదు.. మధ్యతరగతికి కూడా అందుబాటులో లేకుండా వెళ్తోంది పసిడి ధర.. అయితే, ఇవాళ స్వల్పంగా దిగివచ్చింది.. దేశంలో బంగారం ధరలు స్వల్పంగా తగ్గాయి. ఆగస్టు 25, 2026న 24 క్యారెట్ బంగారం ధర గ్రాముకు రూ.16,375గా ఉంది. 22 క్యారెట్ బంగారం గ్రాముకు రూ.15,010, 18 క్యారెట్ బంగారం గ్రాముకు రూ.12,281గా నమోదైంది. అంటే సోమవారం ఆగస్టు 24తో పోలిస్తే స్వల్పంగా తగ్గాయి. 24 క్యారెట్ బంగారం ధర 10 గ్రాములకు రూ.220 తగ్గగా, 22 క్యారెట్ ధర రూ.200, 18 క్యారెట్ ధర రూ.120 మేర తగ్గింది. అంతర్జాతీయ మార్కెట్లలో పరిణామాలు, మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతల ప్రభావంతో బంగారం, వెండి ధరల్లో రోజువారీ హెచ్చుతగ్గులు కొనసాగుతున్నాయి. ఇక, దేశంలోని ఆయా నగరాల వారీగా పసిడి ధరలు చూస్తే చెన్నైలో 24 క్యారెట్ బంగారం గ్రాముకు రూ.16,398, 22 క్యారెట్ రూ.15,031, 18 క్యారెట్ రూ.12,801గా ఉంది. ఢిల్లీలో 24 క్యారెట్ రూ.16,390, 22 క్యారెట్ రూ.15,025, 18 క్యారెట్ రూ.12,296గా నమోదైంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్, పుణెల్లో 24 క్యారెట్ ధర గ్రాముకు రూ.16,375, 22 క్యారెట్ రూ.15,010, 18 క్యారెట్ రూ.12,281గా ఉంది. వడోదర, అహ్మదాబాద్ నగరాల్లో 24 క్యారెట్ రూ.16,380, 22 క్యారెట్ రూ.15,015, 18 క్యారెట్ రూ.12,286గా నమోదైంది. అయితే, బంగారం కొనుగోలు చేసే సమయంలో నగరాన్ని బట్టి ధరల్లో స్వల్ప తేడాలు ఉండొచ్చు. అలాగే ఆభరణాల ధరకు మేకింగ్ ఛార్జీలు, జీఎస్టీ తదితర అదనపు ఖర్చులు కలిసే అవకాశం ఉంటుంది. మరోవైపు వెండి ధర భారీగా దిగివచ్చింది.. సోమవారం ధరలతో పోల్చి చూస్తే.. వెండి ధర ఏకంగా రూ.10,000లు తగ్గింది.. 10 గ్రాముల వెండిపై రూ.100 తగ్గడంతో తులం ధర రూ.2,650గా ఉండగా.. కిలో వెండి ధర రూ.10 వేలు తగ్గడంతో రూ.2,65,000కి దిగివచ్చింది..

# నాలుగు భారత కంపెనీలపై అమెరికా ఆంక్షలు



ఇరాన్ నుంచి చట్టవిరుద్ధంగా పెట్రోలియం, పెట్రోకెమికల్ ఉత్పత్తులను దిగుమతి చేసుకున్నారనే ఆరోపణలతో భారత్‌కు చెందిన నాలుగు కంపెనీలతో పాటు వాటి ప్రతినిధులపై అమెరికా విదేశాంగ శాఖ తీవ్ర ఆంక్షలు విధించింది. 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్' ప్రచారంలో భాగంగా యూఎస్ ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. టెహ్రాన్‌కు లభించే ఆర్థిక మద్దతును పూర్తిగా నిలిపివేయడమే లక్ష్యంగా చేపట్టిన ఈ చర్యలో కస్టమ్స్ బ్రోకర్ సంస్థ పోర్టిజ్ పార్ట్‌నర్స్ ఎల్ఎల్‌పీ, సదాశివ ఓవర్సీస్ లిమిటెడ్, పీపీ సాఫ్ట్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రకృతిస్ ఇన్‌ఫ్రా ఇంపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఉన్నాయి. వీటితో పాటు భారత మూలాలున్న ఇంద్రిస్మియా అప్షిమియా షేక్, హరీష్ రామచంద్ర రంగి, ప్రశాంత్ గార్గ్‌లను కూడా అమెరికా బ్లాక్‌లిస్ట్‌లో ఉంచింది. అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ వెల్లడించిన వివరాల ప్రకారం సదాశివ ఓవర్సీస్ సుమారు 69 మిలియన్ డాలర్లు, పీపీ సాఫ్ట్‌టెక్, ప్రకృతిస్ ఇన్‌ఫ్రాలు చెరో 25 మిలియన్ డాలర్ల విలువైన ఇరాన్ పెట్రోలియం ఉత్పత్తులను కొనుగోలు చేసినట్లు నిర్ధారణ అయింది. ఇరాన్‌తో వ్యాపార సంబంధాలను తక్షణమే నిలిపివేయాలని, లేకపోతే తీవ్రమైన ద్వితీయ ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని అంతర్జాతీయ వ్యాపార సంస్థలను అమెరికా హెచ్చరించింది.

# మార్కెట్‌లో ఉల్లి మంట



బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న ఉల్లి ధరల నుంచి సామాన్యులకు ఊరటనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సాధారణ మార్కెట్ ధరలతో పోలిస్తే చాలా తక్కువగా, కిలో ఉల్లిపాయలను రూ. 35కే విక్రయించనున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్, కేంద్రీయ భండార్ అవుట్‌లెట్ల ద్వారా ఈ రాయితీ ఉల్లిపాయలు వినియోగదారులకు నేరుగా అందుబాటులోకి రానున్నాయి. దేశీయంగా ఉల్లి నిల్వలు సంతృప్తికరంగానే ఉన్నప్పటికీ, పండుగలు, డిమాండ్ ఉన్న సమయంలో ధరలపై పడుతున్న ఒత్తిడిని తగ్గించేందుకు ప్రభుత్వం తమ వద్ద ఉన్న బఫర్ నిల్వలను నేరుగా మార్కెట్లోకి విడుదల చేస్తోంది. ఉల్లి కొరత ఉన్న ప్రధాన నగరాలకు వేగంగా సరుకును చేరవేసేందుకు కేంద్రం 'కందా ఎక్స్‌ప్రెస్' పేరుతో ప్రత్యేక రైలును ప్రారంభించింది. తొలి విడతలో చెన్నై, మదురై, ఎర్నాకులం, గౌహతీలకు పెద్ద ఎత్తున ఉల్లి రవాణా జరుగుతుండగా, రెండో విడతలో ఢిల్లీ, ఉత్తర భారత నగరాలకు సరఫరాలను పెంచనున్నారు. కేవలం ఢిల్లీ నగరానికే సుమారు 800 మెట్రిక్ టన్నుల ఉల్లిని కందా ఎక్స్‌ప్రెస్ ద్వారా తరలిస్తున్నారు. ప్రస్తుతం కొరత కంటే ధరల ఒత్తిడిని తగ్గించడం, ఉల్లి సరఫరాను పెంచే దిశగా కేంద్రం చర్యలు తీసుకుంటోంది.

# రోల్స్ రాయిస్ నుంచి రూ.1,600 కోట్ల ఆర్డర్



ఏరోస్పేస్, రక్షణ రంగంలోని సిగ్మా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్.. రోల్స్ రాయిస్ నుంచి రూ.1,600 కోట్ల విలువైన భారీ ఆర్డర్ దక్కించుకుంది. ఈ ఆర్డర్ కింద రోల్స్ రాయిస్ తయారు చేసే విమాన ఇంజన్లలో ఉపయోగించే కీలక విడిభాగాలను కంపెనీ సరఫరా చేస్తుంది. ఈ దీర్ఘకాలిక కాంట్రాక్టును ఇటీవల టేకోవర్ చేసిన బ్రిటన్‌లోని అనుబంధ కంపెనీ బ్రామ్‌ఫోర్డ్ ప్రెసిషన్ సొల్యూషన్స్ ద్వారా లభించినట్టు కంపెనీ తెలిపింది. ఈ విడిభాగాలను బ్రిటన్‌లోని అనుబంధ కంపెనీతో పాటు భారత్‌లోని సిగ్మా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ యూనిట్లలోనూ తయారు చేసి సరఫరా చేయబోతున్నట్టు పేర్కొంది.

# గ్యాస్ సిలిండర్ ధరలు



ఈ నెల(ఆగస్టు) 1వ తేదీన కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరలు తగ్గించిన విషయం తెలిసిందే. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్‌పై రూ.206 తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ప్రస్తుతం హైదరాబాద్‌లో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర రూ.2,985గా ఉంది. గృహ వినియోగ ఎల్‌పీజీ ధరలో ఎలాంటి మార్పు నమోదు కాలేదు. ఈ రోజు(బుధవారం) ఆగస్టు 26 వ తేది రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం.

**తెలంగాణ**

హైదరాబాద్ : రూ.994.00
వరంగల్ : రూ.1013.00

**ఆంధ్రప్రదేశ్**

విశాఖపట్నం : రూ.950.00
విజయవాడ : రూ.966.50
గుంటూరు : రూ.966.50



# ఇప్పటికీ నమ్మలేకపోతున్నా..

అనుకోకుండా విమానంలో పక్కనే సూపర్ స్టార్ రజినీకాంత్ వచ్చి కూర్చుంటే ఏ అభిమానికైనా అదో అద్భుతమైన అనుభూతే. సరిగ్గా అలాంటి అరుదైన సర్ ప్రైజ్ హైదరాబాద్ వెళ్లే ఫ్లైట్‌లో నటి కయాదు లోహర్‌కు లభించింది. థలైవర్ పక్కనే కూర్చునే అవకాశం రావడంతో ఆమె ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. రజినీకాంత్‌తో కలిసి తీసుకున్న సెల్ఫీని తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా షేర్ చేస్తూ, ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. తనను తాను రజినీకాంత్ కు అతిపెద్ద అభిమానిగా చెప్పుకొచ్చారు. రజినీకాంత్‌ను అంత దగ్గరగా చూసిన క్షణంలో తాను ఇంకా కలలోనే ఉన్నట్లు అనిపించిందని కయాదు తెలిపారు. సూపర్ స్టార్‌ను కలిశానంటే ఇప్పటికీ నమ్మలేకపోతున్నా అని.. ఆయనను చూడగానే తన మనసులో సుందరి పాట మోగడం మొదలైందని, చాలా ఊహించని మధురమైన క్షణంలో ఉండిపోయానని వివరించారు. ఒక అభిమానిగా ఆయన పక్కన కూర్చునే అదృష్టం దక్కడంతో తన రోజు ఎంతో ప్రత్యేకంగా మారిందని సంతోషం వ్యక్తం చేశారు.భవిష్యత్తులో ఎప్పటికైనా రజినీకాంత్‌తో కలిసి ఒక సినిమాలో స్క్రీన్ పంచుకోవాలని ఆశిస్తున్నట్లు తన కోరికను బయటపెట్టారు. తాను ఆ సెల్ఫీలో చూడటానికి బంగాళాదుంపలా ఉన్నానని స్మైల్ ఎమోజీని జత చేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. ఇక కయాదు లోహర్ సినిమాల విషయానికొస్తే.. ఇటీవల పల్లిచట్టంబి, ఇదాయం మురళి వంటి చిత్రాలతో మెప్పించిన ఈ భామ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు.




మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ సరసన 'ఐయామ్ గేమ్' చిత్రంలో నటిస్తుండగా.. తెలుగులో నేచురల్ స్టార్ నానితో నటించే చాన్స్ దక్కించుకున్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రాబోతున్న 'ది ప్యారడైజ్' మూవీలో సుబ్బలక్ష్మి పాత్రలో కనిపించనున్నారు. 'దసరా' వంటి సూపర్ హిట్ తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబోలో రాబోతున్న సినిమా కావడంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ యాక్షన్ థ్రిల్లర్‌లో మోహన్‌బాబు కీలక పాత్రలో నటిస్తుండగా.. ఈ సినిమాను ఎస్ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా సెప్టెంబర్ 24న పాన్ ఇండియా స్థాయిలో విడుదల కాబోతుంది.

# అఫీషియల్ పోస్టర్ వైరల్!

పాన్ ఇండియా ప్రభాస్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న మూవీ 'ఫౌజీ'. ఈ మోస్ట్ అవైటెడ్ పాన్-ఇండియా చిత్రంలో అత్యంత ధైర్యశాలి అయిన సైనికుడిగా ప్రభాస్ కనిపించబోతుండగా.. మూవీపై డార్లింగ్ ఫ్యాన్స్‌తో పాటు ప్రేక్షకుల్లో కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా డిసెంబర్ 3, 2026న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధం అవుతుంది. ఈ క్రమంలోనే ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఓవర్సీస్ పంపిణీ హక్కులకు సంబంధించిన ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ వచ్చేసింది. ఈ సినిమా ఓవర్సీస్ పంపిణీ హక్కులను ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ 'ఫార్స్ ఫిల్మ్' సొంతం చేసుకున్నట్లు మైత్రీ మూవీ మేకర్స్ అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన ఇమాన్వి కథానాయికగా నటిస్తుండగా.. మిథున్ చక్రవర్తి, జయప్రద, అనుపమ్ ఖేర్ వంటి దిగ్గజ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, టి-సిరీస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.




# గంటలో లక్ష టికెట్ల అమ్మకం




కన్నడ స్టార్ హీరో యశ్ లేటెస్ట్ గా నటించిన సినిమా టాక్సిక్. ఈ సినిమా మరికొన్ని గంటల్లోనే రిలీజ్ కానుంది. ఇలాంటి నేపథ్యంలో అడ్వాన్స్ బుకింగ్ లో టాక్సిక్ సినిమా సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. బుక్ మై షో, డిస్టిక్ యాప్స్ లు కలిపి కేవలం గంటలోనే ఏకంగా లక్ష టికెట్లు సేల్ అయ్యాయి. ఈ క్రమంలోనే లక్ష టిక్కెట్లు అమ్ముడైన సినిమాగా టాక్సిక్ చరిత్ర సృష్టించింది.కన్నడ చిత్ర పరిశ్రమలో కేజీఎఫ్ - 2 సినిమా తర్వాత ఈ ఘనత సాధించిన రెండో చిత్రంగా టాక్సిక్ నిలిచింది. ఇక ఇప్పటి వరకు ఇండియాలో అడ్వాన్స్ సేల్స్ ద్వారా రూ.70 కోట్ల మార్కును దాటగా, కేవలం తెలుగు రాష్ట్రాల్లోనే 15 కోట్ల వసూళ్లు సాధించింది టాక్సిక్ మూవీ. అలాగే ముందస్తు టికెట్ల విక్రయాల పరంగా ఈ సినిమా ఇండియాలో అత్యధికంగా ప్రీ సేల్స్ సాధించిన ఆల్ టైం టాప్ 10 సినిమాల క్లబ్ లో కూడా చేరింది. కాగా ఈ సినిమా రూ.500 కోట్లతో తెరకెక్కగా, గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహించారు.

# నితిన్‌కి జోడీగా కన్నడ బ్యూటీ!

'సప్త సాగరాలు దాటి' చిత్రంతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన కన్నడ భామ రుక్మిణి వసంత్, తొలి సినిమాతోనే తెలుగు, కన్నడ ప్రేక్షకుల్లో ఊహించని క్రేజ్ సంపాదించుకున్నారు. తన నటనతో, అందంతో కుర్రకారును మంత్రముగ్ధులను చేసిన ఈ భామ, ఇటీవల వచ్చిన 'కాంతార: చాప్టర్ 1' ఘనవిజయంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఈ బ్యూటీ 'టాక్సిక్' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తూ వరుస అవకాశాలతో దూసుకుపోతున్నారు. ఈ క్రమంలోనే.. తాజాగా, రుక్మిణి వసంత్ ఖాతాలో మరో బిగ్ ప్రాజెక్ట్‌లో చేరినట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి. నితిన్ హీరోగా నటిస్తున్న 'అలియాస్ రుక్మిణి' చిత్రంలో ఆమెను హీరోయిన్‌గా ఎంపిక చేసినట్లు టాక్ వినిపిస్తోంది.ఈ సినిమాను నాచురల్ స్టార్ నాని తన సొంత నిర్మాణ సంస్థ యూనానిమస్ బ్యానర్‌పై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండటం విశేషం. మురళీకాంత్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం ఇప్పటికే పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. సినిమా ప్రకటన సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన ప్రత్యేక వీడియో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకోవడమే కాకుండా సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. అతి త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ కూడా ప్రారంభం కానుందని సమాచారం. వరుస సక్సెస్‌లతో టాప్ ఫామ్‌లో ఉన్న రుక్మిణి వసంత్, నితిన్, నాని కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.




# ట్రోలింగ్ పై కృతి సనన్ స్ట్రాంగ్ కౌంటర్!

రక్షాబంధన్ యాడ్‌లో తాను ధరించిన దుస్తులు, పెంపుడు కుక్కకు రాఖీ కట్టడంపై వచ్చిన విమర్శలకు బాలీవుడ్ నటి కృతి సనన్ గట్టిగా స్పందించారు. సంస్కృతి, సంప్రదాయాలను దుస్తులతో కొలవడం సరికాదని స్పష్టం చేస్తూ, మహిళలు ఏం ధరించాలో ఇతరులు నిర్ణయించే ధోరణిపై కూడా ఆమె ప్రశ్నలు లేవనెత్తారు. ఈ వివాదంలో నటి, రాజకీయ నాయకురాలు కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలు కూడా చర్చకు దారితీశాయి.రక్షాబంధన్ సందర్భంగా ప్రముఖ ఆభరణాల బ్రాండ్ గివా కోసం రూపొందించిన ఓ ప్రకటనలో కృతి సనన్ ఆఫ్ వైట్ రంగు ఇండో వెస్ట్రన్ దుస్తుల్లో కనిపించారు. బ్రాలెట్ తరహా బ్లౌజ్, కేప్, డ్రేప్డ్ స్కర్ట్‌తో ఉన్న ఈ లుక్ సోషల్ మీడియాలో కొందరికి నచ్చగా, మరికొందరు మాత్రం తీవ్రంగా విమర్శించారు. సంప్రదాయ భారతీయ పండుగను చూపించే ప్రకటనలో ఇలాంటి దుస్తులు సరిపోవని పలువురు నెటిజన్లు అభిప్రాయపడ్డారు. అంతేకాదు, కృతి తన పెంపుడు కుక్కకు రాఖీ కట్టడం కూడా కొందరి విమర్శలకు కారణమైంది.ఈ ట్రోలింగ్‌పై కృతి సనన్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్ ద్వారా స్పందించారు. పండుగల అసలు సారం మనం ధరించే దుస్తుల్లో ఉండదని, సంప్రదాయాల పట్ల మనకున్న భావోద్వేగంలో, వాటికి మనం ఇచ్చే అర్థంలో ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. రక్షాబంధన్ అంటే కేవలం ఒక సోదరుడు తన సోదరిని రక్షిస్తాననే భావన మాత్రమే కాదని, పరస్పరం ఒకరికొకరు అండగా నిలిచే ప్రేమ, నమ్మకానికి ప్రతీక అని వివరించారు.



బ్యూటిఫుల్ నటి అనశ్వర రాజన్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈ ముద్దుగుమ్మ ఎక్కువగా మలయాళ చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించుకుంది.'ఉదాహరణం సుజాత' చిత్రంతో వెండితెరకు పరిచయమైన అనశ్వర.. ఆ తర్వాత పలు మలయాళ చిత్రాల్లో నటించింది. గత ఏడాది విడుదలైన 'ఛాంపియన్' చిత్రంతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర ఫెయిల్యూర్ అయినప్పటికీ, అనశ్వరకు మాత్రం మంచి గుర్తింపు దక్కింది. ప్రస్తుతం అనశ్వర రాజన్, మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న 'కాకా' చిత్రంలో ఆయన కుమార్తె పాత్రలో నటిస్తోంది.ఈ మూవీని వచ్చే ఏడాది సంక్రాంతి పండుగ సందర్భంగా జనవరి 13న విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రం మంచి విజయం సాధిస్తే తెలుగులో అనశ్వర క్రేజ్ మరింత పెరిగే అవకాశం ఉంది.సినిమాల్లో పెద్దగా గ్లామర్‌ను ప్రదర్శించకుండా క్లాస్ అండ్ డీసెంట్ పాత్రలతో ఆకట్టుకుంటున్న అనశ్వర.. సోషల్ మీడియాలోనూ సాధారణంగా ఎక్కువగా అందాలను ఆరబోయదు. అయితే తాజాగా హాట్ ఫోటోలతో సోషల్ మీడియాలో సందడి చేసింది. బ్లాక్ కోట్‌కు సూట్ అయ్యే పొట్టి నిక్కర్ ధరించి, చేతిలో గొడుగు పట్టుకుని ఫోటోలకు ఫోజులిచ్చింది.ఈ ఫోటోల్లో తన కురులను గాలికి వదిలేసి స్టైలిష్‌గా కనిపించింది. మొత్తంగా ఈ ఫోటోల్లో అనశ్వర లుక్ సూపర్‌గా ఉండటంతో ఆమె అభిమానులు ఈ పిక్స్‌ను తెగ షేర్ చేస్తున్నారు. దీంతో ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# ఈ లుక్‌లో చూసుండరు






# తెలుగు విడుదల తేదీ వచ్చేసింది

నివిన్ పౌలీ, మమితా బైజు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బెత్లెహేమ్ కుటుంబ యూనిట్'. గిరీష్ ఏ.డీ. దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఆగస్టు 20న మలయాళ భాషలో విడుదలైంది. మంచి అంచనాల నడుమ ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఇప్పటికే బ్లాక్‌బస్టర్ టాక్‌ను సొంతం చేసుకుని అద్భుతమైన కలెక్షన్లను రాబడుతోంది. ఇప్పటికే మంచి విజయాన్ని అందుకున్న ఈ సినిమాను తెలుగులో కూడా విడుదల చేయనున్నారు.తాజాగా దీనికి సంబంధించిన అధికారిక ప్రకటనను మేకర్స్ విడుదల చేశారు. ఈ మూవీని సెప్టెంబర్ 4న తెలుగులో రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. తెలుగులోనూ 'బెత్లెహేమ్ కుటుంబ యూనిట్' అనే టైటిల్‌తోనే ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. మరి ఈ మూవీ తెలుగు ప్రేక్షకులను ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో చూడాలి. ఈ చిత్రంలో వినయ్ ఫోర్ట్, సంగీత్ కీలక పాత్రలు పోషించారు. భావనా స్టూడియోస్ బ్యానర్‌పై దిలీష్ పోతన్, ఫహద్ ఫాసిల్, శ్యామ్ పుష్కరన్ ఈ చిత్రాన్ని నిర్మించారు. విష్ణు విజయ్ సంగీతాన్ని అందించారు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**